




చక్కెర కర్మాగారాలకు చేదు కాలం

తుమ్మపాల షుగర్స్ ఆధునికీకరణ హామీని తుంగలో తొక్కిన సీఎం జగన్



తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ (ఫైల్ ఫోటో)

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

"మేం అధికారంలోకి వస్తే తుమ్మపాల సహకార చక్కెర కర్మాగారాన్ని ఆధునీకరిస్తాం. ఫ్యాక్టరీని యథావిధిగా నడుపుతాం."

ప్రతిపక్ష నేతగా వున్నప్పుడు అనకాపల్లి పర్యటనకు వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత హామీని తుంగలో తొక్కారు. ఆధునికీకరణ మాట అటుంచి.. ఫ్యాక్టరీని శాశ్వతంగా మూసివేయించి, ఖాయిలా పరిశ్రమల జాబితో చేర్చారు. ఇదే కాకుండా జిల్లాలో మరో రెండు సహకార చక్కెర ఫ్యాక్టరీలు.. ఏటికొప్పాక, తాండవలను కూడా మూసివేయించారు. మిగిలిన ఒక్కగానొక్క గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణ, ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు హామీలు సైతం గాలిలో కలిసిపోయాయి.

- ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చర్యలు శూన్యం
- శాశ్వతంగా మూసివేత.. ఆస్తుల లిక్విడేషన్‌కు ఆదేశాలు
- రూ.కోట్ల ఆస్తులను కారు చౌకగా అస్మదీయులకు కట్టబెట్టేందుకు యత్నాలు
- కోర్టును ఆశ్రయించి అడ్డుకున్న చెరకు రైతులు
- తుమ్మపాల బాటలోనే ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలు
- మూడేళ్ల క్రితం మూసివేత
- ఇంతవరకు అతీగతీలేని వైనం
- గాలిలో కలిసిన గోవాడ షుగర్స్ ఆధునికీకరణ, ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు
- వైసీపీ పాలకుల తీరుపై మండిపడుతున్న చెరకు రైతులు, ఫ్యాక్టరీల కార్మికులు

గత సార్వత్రిక ఎన్నికల ముందు అప్పటి ప్రతిపక్ష నేతగా వున్న వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలాయి. పాదయాత్ర, ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇచ్చిన హామీలను ఐదేళ్లపాటు అధికారంలో వున్నప్పటికీ అమలు చేయలేదు. ప్రధానంగా సహకార చక్కెర ఫ్యాక్టరీల విషయంలో 'మాట తప్పారు.. మడమ తిప్పేశారు' అని చెరకు రైతులు, ఆయా ఫ్యాక్టరీల కార్మికులు, ఉద్యోగులు ఎద్దేవా చేస్తున్నారు. కొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మరోసారి మాయమాటలు, రకరకాల హామీలు గుప్పించి ఓట్లు దండుకోనేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపిస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలోని సహకార షుగర్ ఫ్యాక్టరీలు నష్టాల పట్టాయి. సుదీర్ఘ చరిత్ర కలిగిన వీవీ రమణ తుమ్మపాల (అనకాపల్లి) కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీతోపాటు ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలను నిర్వీర్యం ... మిగతా 8వ పేజీలో

చరిత్ర పుటల్లోకి తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ



తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ

అనకాపల్లి మండలం తుమ్మపాలలో 1937 ప్రాంతంలో గుజరాత్‌కి చెందిన కాంతీలాల్ అనే వ్యాపారి 450 టన్నుల సామర్థ్యంతో చక్కెర కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. తరువాత దశల వారీగా విస్తరించారు. 1957లో రైతులు, కార్మికులతో ఏర్పడిన గొడవల కారణంగా యాజమాన్యం.. షుగర్ ఫ్యాక్టరీని తూర్పుగోదావరి జిల్లా ఎర్రవరం ప్రాంతానికి తరలించడానికి సిద్ధపడింది. నాటి రాజ్యసభ సభ్యుడు వి.వి.రమణ ప్రైవేటురంగంలోని ఫ్యాక్టరీని సహకార రంగంలోకి మార్పించారు. 1959 నుంచి ఇప్పటి వరకు సహకార రంగంలోనే కొనసాగుతున్నది. అయితే కాలక్రమేణా ఫ్యాక్టరీ యంత్ర పరికరాలు పాతబడిపోవడం, క్రషింగ్‌లో తరచూ సమస్యలు తలెత్తుతుండడంతో చెరకు క్రషింగ్, పంచదార రికవరీ శాతం తగ్గిపోతూ వచ్చాయి. దీంతో ఫ్యాక్టరీ నష్టాల బారినపడి మూడేళ్ల క్రితం మూతపడింది. తరువాత 2016-17 సీజన్‌లో టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఫ్యాక్టరీని తెరిపించింది. కానీ యంత్రాలు పాతబడిపోవడంతో పూర్తిస్థాయిలో క్రషింగ్ జరగలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడం, అంతకుముందు ఎన్నికల ప్రచారంలో తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరిస్తామని జగన్మోహన్‌రెడ్డి చెప్పడంతో సానుకూల నిర్ణయం తీసుకుంటారని రైతులు, కార్మికులు ఆశించారు. కానీ ఆధునికీకరణ మాట అటుంచి.. ఏకంగా ఫ్యాక్టరీని మూసివేయించారు. జిల్లా పునర్విభజన తరువాత అనకాపల్లి కేంద్రంగా కొత్తగా ఏర్పాటైన విషయం తెలిసిందే. స్థానిక ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రిగా నియమితులయ్యారు. సొంత నియోజకవర్గంలో సహకార షుగర్ ఫ్యాక్టరీని తెరిపించడానికి కనీస ప్రయత్నాలు చేయలేదు.

తుమ్మపాల బాటలో ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీలు



ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ



తాండవ షుగర్ ఫ్యాక్టరీ

జిల్లాలో 2018 ఆగస్టు నెలలో ప్రతిపక్ష నేత హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి మహా సంకల్ప పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా తాండవ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీల రైతులు, కార్మికులు ఆయనను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. తమ పార్టీ అధికారంలోకి రాగానే ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరించి, పూర్వవైభవం తెస్తామని హామీ వచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఆధునికీకరణ హామీని మరచిపోయారు. రెండు సీజన్‌లలో మాత్రమే చెరకు క్రషింగ్ జరిగింది. 2021-22 సీజన్ తరువాత ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. రైతులకు చెరకు బకాయిలు, కార్మికులకు వేతన బకాయిలు చెల్లించలేదు.. ఫ్యాక్టరీలను పునఃప్రారంభించలేదు. చెరకు రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉపాధి లేక కార్మికులు వీధిన పడ్డారు.

చెరకు సాగుకు స్వస్తి



తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ నడుస్తున్నప్పుడు ఏటా 50 నుంచి 60 టన్నుల వరకు చెరకు సరఫరా చేశాను. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే ఫ్యాక్టరీని మూసేశారు. అప్పటికే పొలంలో చెరకు పైరు వుంది. రెండుళ్లపాటు గోవాడ, పాలకొండ షుగర్ ఫ్యాక్టరీలకు చెరకు తరలించాం. కానీ తీవ్ర ఇబ్బందులు ఎదురు కావడంతో చెరకు సాగు పూర్తిగా మానేశాను. వైసీపీ ప్రభుత్వం తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని తెరిపించకపోగా, ఆస్తుల అమ్మకానికి తెగబడడం శోచనీయం.

- కొణతాల మోదినాయుడు, రైతు, తుమ్మపాల



ఎలమంచిలిలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మనోరమకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్. చిత్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, సీనియర్ నాయకుడు పప్పల చలపతిరావు, ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు

తొలిరోజు ఏడు నామినేషన్లు

అనకాపల్లి లోక్‌సభకు ఒకటి, అసెంబ్లీకి ఆరు పత్రాలు దాఖలు

చోడవరం, మాడుగుల, పాయకరావుపేటలకు నామినేషన్లు నిల్

అనకాపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో ఎన్నికల్లో కీలకమట్టమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ మొదలైంది. జిల్లాలో ఒక లోక్‌సభ, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్ల స్వీకరణకు జిల్లా రిటర్నింగ్ అధికారి అయిన కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి నోటిఫికేషన్ జారీ చేశారు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి ఆయా కేంద్రాల్లో ఆర్‌వోలు నామినేషన్ పత్రాల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. తొలిరోజు ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. అనకాపల్లి లోక్‌సభ స్థానానికి ఒకటి, అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి రెండు, నర్సీపట్నం అసెంబ్లీకి రెండు, ఎలమంచిలి అసెంబ్లీకి రెండు చొప్పున నామినేషన్లు వేశారు. చోడవరం, మాడుగుల, పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కరు కూడా నామినేషన్ వేయలేదు.

అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పెందుర్తి చాకలివీధికి చెందిన షేక్ షఫీఉల్లా జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టికి నామినేషన్ పత్రాలు అందజేశారు. అయితే ఆయన బీ ఫారం సమర్పించకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తూ నామినేషన్ పత్రాలు స్వీకరించారు.

అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి బహుజన సమాజ్ పార్టీ తరపున సూదికొండ మాణిక్యాలరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున పొలమరశెట్టి అంబికాదేవి నామినేషన్లు వేశారు. ఎలమంచిలిలో జనసేన పార్టీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ కె.మనోరమకు అందించారు. రిఫార్మ్ పార్టీ అభ్యర్థిగా బోజా నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా బొట్టా నాగరాజు, స్వతంత్ర అభ్యర్థిగా న్యాయవాది బయపురెడ్డి భద్రాచలం నామినేషన్లు దాఖలు చేశారు.

నేడు అయ్యన్నపాత్రుడు నామినేషన్

నివాసం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ

నర్సీపట్నం, ఏప్రిల్ 19: నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా చింతకాయల అయ్యన్నపాత్రుడు శుక్రవారం నామినేషన దాఖలు చేయనున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు శివపురంలోని తన నివాసం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా బయలుదేరి ఐదు రోడ్లు కూడలి, కృష్ణాబజార్, అబీద్ సెంటర్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటారు. కాగా తెలుగుదేశం ఆవిర్భావం నుంచి 2019 వరకు జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికల్లో (తొమ్మిదిసార్లు) అయ్యన్నపాత్రుడు పోటీ చేశారు. 1996లో అనకాపల్లి నుంచి ఎంపీగా గెలిచారు. తాజాగా పదోసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగుతున్నారు. ఒకే నియోజకవర్గం నుంచి వరుసగా పదిసార్లు పోటీ చేస్తున్న ఆయన అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు.

జన కేతనం

- విశాఖ తూర్పు... విశిష్టం!
- దటీజ్ దిమిలి!
- ఎన్నికల ఖర్చుపై డేగ కన్ను
- 7లో

వైసీపీ నుంచి భారీ వలసలు

పరవాడ, దోసూరు సర్పంచులతోపాటు పలువురు నాయకులు జనసేనలో చేరిక



ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేనలో చేరిన దోసూరు సర్పంచ్ నర్మాల సుజాత దంపతులు, ఇతర నాయకులు

- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన పెందుర్తి, ఎలమంచిలి అభ్యర్థులు పంచకర్ల, సుందరపు

పరవాడ/ అచ్యుతాపురం, ఏప్రిల్ 18: **పెందుర్తి, ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన పలువురు వైసీపీ నేతలు గురువారం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి జనసేన పార్టీలో చేరారు. వీరిలో ఇద్దరు సర్పంచులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు వున్నారు.**

పెందుర్తి నియోజకవర్గంలో మండల కేంద్రమైన పరవాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఆయన అనుచరులు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు. గురువారం పరవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం నుంచి కూటమి తరపున జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు సమక్షంలో సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడుతోపాటు పరవాడ పెద్ద చెరువు ఆయకట్టు రైతు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీను, పలువురు వార్డు మెంబర్లు, సుమారు 300 మంది జనసేన తీర్థం పుచ్చుకున్నారు. అలాగే గొర్లివానిపాలెం పంచాయతీలో వైసీపీకి చెందిన పైలా దినేశ్, తన వందమంది అనుచరులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. జీవీఎంసీ 85వ వార్డు మంత్రిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకురాలు పచ్చికోరు వెంకట వరలక్ష్మి 50 మందితో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ రమేశ్‌బాబు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ కన్నూరు వెంకటరమణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి దోసూరు సర్పంచ్..

అచ్యుతాపురం, ఏప్రిల్ 18: మండలంలోని దోసూరు సర్పంచ్ నర్మాల సుజాత, ఆమె భర్త రామకృష్ణ తమ అనుచరులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. అచ్యుతాపురంలోని జనసేన పార్టీ ... మిగతా 8వ పేజీలో

మరింత పెరిగిన భానుడి ప్రతాపం

14 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

- రావికమతంలో 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు



చోడవరం శివారు కొత్తూరు వద్ద వాహనాల సందడి లేని బీఎన్ రోడ్డు

అనకాపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాపై భానుడి ప్రతాపం మరింత పెరిగింది. గురువారం కూడా ఎండ తీవ్రత కొనసాగింది. జిల్లాలో 24 మండలాలు ఉండగా 14 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీశాయి. 16 మండలాల్లో 40 డిగ్రీలకు పైబడి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడగాడ్పుల దెబ్బకు జనం విలవిలలాడి పోయారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రహదారులు నిర్మానుష్యంగా మారాయి.

గురువారం రావికమతం మండలంలో 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మిగిలిన మండలాలను పరిశీలిస్తే.. చీడికాడ, దేవరాపల్లిల్లో 43.4, నర్సీపట్నంలో 42.9, కోటవురట్లలో 42.6 ... మిగతా 8వ పేజీలో

జీడిమామిడి రైతుకు ఎన్నికల కోడ్ దెబ్బ

నగదు రవాణాపై ఆంక్షలతో పిక్కల కొనుగోలుకు ముందురాని ఇతర రాష్ట్రాల వ్యాపారులు

- ఇదే అదనుగా ధరలు తగ్గించేసిన దళారులు
- క్వింటా రూ.9 వేలకు పతనం
- గత ఏడాది రూ.12 వేలు పలికిన ధర



అమ్మకానికి సిద్ధం చేసిన జీడి పిక్కలు

రావికమతం, ఏప్రిల్ 18: ఎన్నికల కోడ్ ప్రభావం జీడి పిక్కల ధరలపై పడింది. జీడి పిక్కలకు, ఎన్నికల కోడ్‌కు సంబంధం ఏమిటి అన్న అనుమానం వస్తున్నదా? ఇది ముమ్మాటికీ నిజం. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్లడానికి వీలులేదు. ఒక వేళ రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లాల్సి వస్తే.. తనిఖీ అధికారులకు తగిన ఆధారాలు చూపాల్సి వుంటుంది. దీంతో వ్యాపారులు పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లడానికి వీలుకాక, జీడి పిక్కల కొనుగోలుకు ముందుకు రావడంలేదు. మరోవైపు తోటల్లో సేకరించిన జీడి పిక్కలను ధర తగ్గించి అయినా అమ్ముకోవడానికి రైతులు సిద్ధపడాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలో సుమారు 50 వేల హెక్టార్లలో జీడిమామిడి తోటలు వున్నాయి. ఇంచుమించుగా అన్ని మండలాల్లో రైతులు జీడిమామిడిని సాగు చేస్తున్నారు. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా తోటల్లో పూత ఆలస్యంగా వచ్చింది. పూత వచ్చే సమయానికి అధిక చలితోపాటు మంచు దట్టంగా కురవడంతో టీ దోమ తెగులు విజృంభించింది. దీంతో చాలా వరకు పూత, పందెలు మాడిపోయాయి. తరువాత కాయ తొలుచు పురుగు, పేనుబంక పురుగు సోకవడంతో దిగుబడి మరింత తగ్గింది. కాపు బాగా కాస్తే ఎకరాకు ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల వరకు జీడి పిక్కల దిగుబడి వస్తుంది. కానీ ఈ ఏడాది మూడు నాలుగు క్వింటాళ్లకు మించి రావడంలేదని ... మిగతా 8వ పేజీలో

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029

నేడు అప్పన్న తిరు కల్యాణోత్సవం



విద్యుద్దీప కాంతుల్లో సింహగిరి ఆలయప్రాంగణం - 6లో

మే 1 నుంచి పవన్‌కల్యాణ్ పర్యటన



విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఉత్తరాంధ్రలో పర్యటించ నున్నారు. ఒకటో తేదీన ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని ఎలమంచిలి, పెందుర్తి, రెండో తేదీన విశాఖ దక్షిణ నియోజకవర్గాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. మూడో తేదీన పాలకొండ, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో పర్యటిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

నేడు జిల్లాలోకి జగన్ బస్సు యాత్ర



పాయకరావుపేట, ఏప్రిల్ 18: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర శుక్రవారం రాత్రి పాయకరావుపేట వద్ద అనకాపల్లి జిల్లాలోకి ప్రవేశించనుంది. కాకినాడ జిల్లా తునిలో పర్యటన ముగించుకుని రాత్రి 9 గంటలకు జాతీయ రహదారి మీదుగా జిల్లాలోకి ప్రవేశిస్తారు. వై జంక్షన్ వద్ద స్వాగతం పలకడానికి ఏర్పాటు చేస్తున్నట్టు వైసీపీ నాయకులు చెప్పారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు చేరుకుని అక్కడ రాత్రి బస చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

క్రైం... crime news

లారీని ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్

▸▸ డ్రైవర్ మృతి


మృతిచెందిన ట్యాంకర్ డ్రైవర్ శ్రీనివాసరావు

సబ్బవరం, ఏప్రిల్ 18: మండలంలోని ఇరువాడ వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ఆగి ఉన్న లారీని ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందాడు. సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రూరల్ ఇందరపాలెం గ్రామానికి చెందిన డ్రైవర్ మసుమోను శ్రీనివాసరావు(44) కాకినాడ నుంచి బుధవారం ఆయిల్ ట్యాంకర్‌తో భువనేశ్వర్ వెళుతున్నాడు. మార్గమధ్యంలో ఇరువాడ వద్ద జాతీయ రహదారిపై రెస్ట్ ఏరియా సమీపంలో ఆగి ఉన్న లారీ బలంగా ఢీకొట్టాడు. దీంతో ట్యాంకర్ కేబిన్ నుజ్జునుజ్జు అయ్యింది. డ్రైవర్ శ్రీనివాసరావు కేబిన్‌లో ఇరుక్కుపోయాడు. దీంతో అతని ఎడమ కాలు తొడభాగం విరిగిపోయింది. అతన్ని కేబిన్ నుంచి వెలికి తీసి చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడని సీఐ రమణ తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

దార్లపూడిలో 90 మద్యం బాటిళ్లు పట్టివేత

ఎస్.రాయవరం, ఏప్రిల్ 18: మండలంలోని దార్లపూడి గ్రామంలో ఓ మహిళ ఇంటి వద్ద 90 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. గురువారం ఆయన విలేకర్ల మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఓ మహిళ మద్యం విక్రయించడానికి పలు ప్రభుత్వ మద్యం షాపుల నుంచి బాటిళ్లను కొనుగోలు చేసుకుందన్నారు. వాటిని తన ఇంటి వద్ద దాచి ఉంచినట్టు అందిన సమాచారంతో దాడి చేసి, 90 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్టు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి మహిళను అరెస్టు చేసినట్టు అయన తెలిపారు.

వైన్‌షాపు సూపర్‌వైజర్ విధుల నుంచి తొలగింపు

పాయకరావుపేట, ఏప్రిల్ 18: పాయకరావుపేటలో మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన ప్రభుత్వ వైన్ షాపు సూపర్‌వైజర్‌ని విధుల నుంచి అధికారులు తొలగించారు. పట్టణంలోని ప్రభుత్వ వైన్‌షాపులో కోనేటి నాగవెంకట పద్మారావు అనే వ్యక్తి సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం ఎటువంటి అనుమతుల్లేకుండా ఆరు మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ జోగారావు పట్టుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై నివేదిక అందుకున్న జిల్లా ఉన్నతాధికారులు పద్మారావుని విధుల నుంచి తొలగించారు.

30 లీటర్ల సారా స్వాధీనం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 18 : మండలంలో గురువారం రెండు గ్రామాల్లో పోలీసులు దాడులు చేసి ఐదు వేల లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేసి, 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐలు జోగారావు, రామారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అరట్లకోట శివార్లలో నాటు సారా తయారీ బట్టీలపై గురువారం పోలీసులు దాడి చేయగా వారిని చూసి గుర్తు తెలియని వ్యక్తులు పారిపోయారు. ఆ ప్రదేశంలో నిల్వ ఉంచిన ఐదు వేల లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. అదేవిధంగా ఎస్ఐ రామారావు పక్కా సమాచారంతో గుంటపల్లి శివార్లలో మాటువేయగా ఇద్దరు వ్యక్తులు రెండు ప్లాస్టిక్ సంచుల్లో 30 లీటర్ల సారా తరలిస్తూ పట్టుబడ్డారు. సారాను స్వాధీనం చేసుకుని, నిందితులు జి.సూర్యారావు, పి.వెంకటసత్యనారాయణలను అరెస్టు చేసి, రిమాండ్‌కి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం


సతీశ్, మాధవ్‌కుమార్ (ఫైల్)

పెద్దాపురం, ఏప్రిల్ 18: పెద్దాపురం - రాజమహేంద్రవరం ఏడీబీ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలుకాగా మరో యువకుడు తీవ్ర గాయాలపాలైన ఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లికి చెందిన లాలం సతీశ్(20), విశాఖపట్నానికి చెందిన బర్రి మాధవ్‌కుమార్(19), శ్రీకాకుళం జిల్లా చిగురువలసకు చెందిన మరో స్నేహితుడు రామచంద్రరావు ముగ్గురూ కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణానికి వచ్చారు. తిరిగి మోటార్ సైకిల్‌పై రూముకు వెళుతుండగా వారిని మార్గమధ్యంలో గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో మాధవ్, సతీశ్ ఇద్దరు యువకులు అక్కడికక్కడే కిందపడి మృతిచెందగా మరో యువకుడు నక్కా రామచంద్రరావు తీవ్రంగా గాయాలపాలయ్యాడు. బైక్‌ను ఢీకొట్టిన వాహనం సంఘటనా స్థలం నుంచి ఆగకుండా వెళ్లిపోయింది. మృతిచెందిన యువకులు రామేశంపేటలో గది అద్దెకు తీసుకుని చదువుకుంటున్నారు. మృతిచెందిన యువకులు ఇద్దరూ యువకులు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఢీకొట్టిన వాహనం వివరాలను కోసం విచారణ చేపట్టారు. గాయపడిన రామచంద్రరావును స్థానిక ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను స్థానిక ఆసుపత్రికి పంచనామా నిమిత్తం తరలించారు.

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

▸▸ ఇంటి పన్ను కోసం లంచం డిమాండ్

పెందుర్తి, ఏప్రిల్ 18: ఇంటికి పన్ను వేసేందుకు రూ.8 వేలు లంచం తీసుకుంటూ ఓ పంచాయతీ కార్యదర్శి, ఆయన సహాయకుడు గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఇందుకు సంబంధించి బాధితుడు అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ నగర వాసి ఒకరికి మండలంలోని వాలిమెరకజుత్తాడలో ఇల్లు ఉంది. అది ఆయన తల్లి పేరిట ఉంది. ఆ ఇంటికి పన్ను నిర్ధారిత పత్రం కోసం ఆయన దరఖాస్తు చేసుకున్నారు. అందుకోసం రూ.8 వేలు లంచం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి వి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని నగర వాసి...ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు బాధితుడు గురువారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సత్యనారాయణ, ఆయన సహాయకుడు కొర్ర విక్టర్ ప్రవీణ్‌లకు రూ.8 వేలు అందజేశారు. అదే సమయంలో ఏసీబీ అధికారులు కార్యాలయంలో ప్రవేశించి రెడ్‌హ్యాండెడ్‌గా కార్యదర్శిని పట్టుకున్నారు. పంచాయతీ కార్యదర్శి తనను రూ.8 వేలు డిమాండ్ చేయగా, తాను రూ.3 వేలు ఇస్తానన్నానని, రూ.8 వేలు ఇవ్వకపోతే ఇంటి పన్ను వేసేది లేదని చెప్పడంతో ఏసీబీ కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపారు. కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదును నమోదు చేసుకుని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ అధికారులు ఈ దాడులు నిర్వహించారు.

నేడు అప్పన్న తిరు కల్యాణోత్సవం

సింహాచలం, ఏప్రిల్ 18: వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం శుక్రవారం జరగనుంది. ఈమేరకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. రాత్రి 10.00 నుంచి జరిగే రథోత్సవం, కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు సుమారు 50 వేల మంది భక్తులు వస్తారని అంచనా. ఈమేరకు ఉత్తర రాజగోపురానికి సమీపంలో ప్రత్యేక యాగ శాల నిర్మించారు. సాయంత్రం 3.30 గంటలకు కొట్నాల ఉత్సవం, 4 నుంచి 6.30 వరకు ఆరాధన, విశేష హోమాలు, గ్రామ బలిహరణం, ధ్వజారోహణం, సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు ఎదురు సన్నాహోత్సవం, బంగారు తోళిక్కినియాన్‌పై తిరువీధి, ముత్యాల పల్లకిలో అమ్మవార్ల సేవ, రాత్రి 7.30 నుంచి 8 వరకు స్వామివారికి రథంపై అలంకరణ, 8.30 నుంచి 10 వరకు సింహగిరి మాడవీధుల్లో జాలరి కుల పెద్ద కదరి లక్ష్మణరావు సారథ్యంలో రథోత్సవం నిర్వహించనున్నారు. రథోత్సవం ముగిసిన అనంతరం రాత్రి 10.00 నుంచి నృసింహ మండపం లోపలి ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై స్వామివారి వార్షిక తిరుకల్యాణ మహోత్సవం జరప నున్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిని విద్యుత్ దీపాకాంతులతో శోభాయమానంగా అలంకరించారు.

దర్శన వేళల్లో స్వల్ప మార్పులు

కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే కొట్నాల ఉత్సవం కారణంగా మధ్యాహ్నం 3.00 నుంచి రాత్రి 8.30 వరకు భక్తులకు స్వామివారి దర్శనాలు లభించవు. రాత్రి 8.30 నుంచి 10 వరకు దర్శనాలు లభిస్తాయి.

చికెన్ ధరలు


బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

ఎన్నికలను బహిష్కరిస్తున్నాం

▸▸ డీఆర్‌ఓకు తీర్మానం పత్రాన్ని అందజేసిన మూలస్వయంభూవరం గ్రామస్థులు


డీఆర్‌వో దయానిధికి తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న మూలస్వయంభూవరం గ్రామస్థులు

పరవాడ, ఏప్రిల్ 18: సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇదే అంశాన్ని పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడంతో వచ్చే సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు మూలస్వయంభూవరం గ్రామస్థులు స్పష్టం చేశారు. ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు గ్రామస్థుల సంతకాలతో కూడిన తీర్మాన పత్రాన్ని గురువారం డీఆర్ఓ దయానిధికి అందజేశారు. సింహాద్రి కాలుష్యంతో తరచూ అనారోగ్యాలకు గురవుతున్నామని పేర్కొన్నారు. అధికారులు, పాలకులు తమ గోడును పట్టించుకోకపోవడంతో వారి తీరును నిరసిస్తూ ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. గ్రామాన్ని సురక్షిత ప్రాంతాన్ని తరలించే వరకు ఏ ఎన్నికల్లోనూ కూడా పాల్గొనబోమని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి బాబూరావు, మరిసా అప్పారావు, బొండా కనకరాజు, మరిసా రవి తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో కూటమిదే విజయం

▸▸ మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

▸▸ బండారుకు మాడుగుల టికెట్ పట్ల హర్షం


సబ్బవరంలో బండారుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు

సబ్బవరం, ఏప్రిల్ 18: మాడుగులలో కూటమిదే విజయమని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం ఆయన సింహాచలం లక్ష్మీనరసింహస్వామితోపాటు ఇష్టదైవాలైన పైడివాడఅగ్రహారం కనకమహాలక్ష్మి, సబ్బవరం దుర్గామాంబ అమ్మవార్లను దర్శించుకొని మాడుగుల బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా సబ్బవరంలో ఆయనకు టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం బండారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక పరిస్థితుల్లో అధిష్ఠానం నాకు మాడుగుల సీటు కేటాయించిందన్నారు. అక్కడ రాజకీయ పరిణామాల నేపథ్యంలో మాజీఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, ఇన్‌చార్జి పీవీజీ కుమార్ తనకు సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. పైలా ప్రసాద్‌ను కూడా కలిసి శుక్రవారం మాడుగుల నియోజకవర్గంలో ప్రచారం ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. తాను ఎక్కడ ఉన్నా పెందుర్తి నియోజవకర్గ నేతలు, ప్రజలకు అందుబాటులోనే ఉంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గవిరెడ్డి రామానాయుడు, పీవీజీ కుమార్, స్థానిక భరణికాన బాబూరావు, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు పీవీఎస్ఎన్ రాజు, పెందుర్తి కార్యదర్శి రోమాల చంద్రశేఖర్, గండి దేముడు, ముత్యాలనాయుడు, దాసరి రమణ, దుర్గినాయుడు, మహాలక్ష్మీనాయుడు, కొరాడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అందరినీ కలుపుకొని వెళతా...

మాడుగులను పెందుర్తి, పరవాడ కన్నా అభివృద్ధి చేస్తా..

▸▸ ఉమ్మడి అభ్యర్థిగా ప్రచారం చేసుకోమని చంద్రబాబు పంపారు

▸▸ మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి వెల్లడి

▸▸ ముకుందపురం నుంచి బైక్ ర్యాలీగా మోదకొండమ్మ ఆలయానికి చేరి పూజలు


టీడీపీ శ్రేణులతో ర్యాలీగా వస్తున్న బండారు, గవిరెడ్డి, పీవీజీ, తదితరులు


మాడుగుల మోదకొండమ్మను దర్శించుకుంటున్న బండారు, తదితరులు

మాడుగుల, ఏప్రిల్ 18 : అందరినీ కలుపుకొని పోతూ పరవాడ, పెందుర్తి నియోజకవర్గాలకన్నా మాడుగుల నియోజకవర్గాన్ని ఎక్కువగా అభివృద్ధి చేసి చూపిస్తానని మాజీ మంత్రి బండారు సత్యానారాయణ మూర్తి స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని ముకుందపురం గ్రామం నుంచి ఎనిమిది కి.మీ.మేర నాయకులు, కార్యకర్తలు అభిమానులతో కలిసి గురువారం ఆయన భారీ ర్యాలీగా మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బండారు దంపతులతో పాటు గవిరెడ్డి, పీవీజీలకు ఆలయ కమిటీ ప్రతినిధులు స్వాగతం పలికారు. అమ్మవారికి బండారు పూజలు నిర్వహించిన అనంతరం అర్చకుల ఆశీర్వచనాలను అందుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాడుగుల నుంచి తనను టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రచారం చేసుకోమని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పంపించారని వివరించారు. కొన్ని అనివార్య కారణాల వల్ల పైలా ప్రసాదరావు స్థానంలో తనను ఇక్కడకు పంపించారని బండారు స్పష్టం చేశారు. మాడుగుల నియోకవర్గంలోని అలమండ, చీడికాడ తమ తాతగారి ఊర్లని, బాల్యంలో ఇక్కడే చదివానని వివరించారు. అందరితో సత్సంబంధాలు ఉన్నాయన్నారు. మాడుగుల నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలవనున్న తనను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పాటు ప్రతి ఒక్కరిపై ఉందని విజ్ఞప్తి చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందినా ఈ నియోజకవర్గంలో అన్ని విధాలుగా నడిపించేది గవిరెడ్డి రామానాయుడేనని బండారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు సురేష్‌నాయుడు, టీడీపీ అకాపల్లి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, పుప్పాల అప్పలరాజులతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు


కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 18: ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను గురువారం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు సంజయ్ గాంధీ, ఆశిష్‌కుమార్ పాండే వేర్వేరుగా పరిశీలించారు. తొలుత ఉదయం పది గంటలకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టితో కలిసి వ్యయ పరిశీలకులు సంజయ్‌గాంధీ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. 11 గంటలు దాటిన తరువాత అనకాపల్లి, మాడుగుల, చోడవరం నియోజకవర్గాల పరిశీలకులు ఆశిష్‌కుమార్ పాండే కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్‌రూమ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మత్స్యశాఖ ఏడీ ప్రసాద్‌ను ఇక్కడ సేవలపై ఆరా తీశారు. అనంతరం పలు సలహాలు, సూచనలను అందజేశారు.

జగనాసురుడిని రాష్ట్రం నుంచి తరిమికొట్టండి

▸▸ బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్


బండారును సన్మానిస్తున్న సీఎం రమేశ్, పంచకర్ల రమేశ్‌బాబు

పరవాడ, ఏప్రిల్ 18 : ఐదేళ్ల పాటు రాష్ట్ర ప్రజలను నానా రకాలుగా ఇబ్బందులను పెట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పి, రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ పిలుపునిచ్చారు. వెన్నెలపాలెంలోని మాజీ మంత్రి బండారు నివాసం వద్ద గురువారం రాత్రి ఏర్పాటు చేసిన బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని జగన్ అనుకూల మీడియా తప్ప మిగతా మీడియా సంస్థలు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని తేల్చి చెబుతున్నాయన్నారు. వైసీపీ నుంచి పోటీ చేస్తున్న 25ఎంపీ అభ్యర్థుల్లో ఒక్కరూ కూడా గెలవలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఐదేళ్లలో వైసీపీ నాయకులు ఇసుక, మద్యం, అక్రమ మైనింగ్ ద్వారా సంపాదించిన సొమ్ము అంతా కక్కిస్తామన్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గంలో జనసేనకు ఎంత మెజార్టీ ఇస్తున్నారో ఎంపీగా సీఎం రమేశ్‌కు కూడా సమాన మెజార్టీ ఇవ్వాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలను వేధించిన వారు ఇప్పుడు జనసేనలోకి రావాలని చూస్తున్నారని, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీలో చేర్చుకోవద్దని ఆయన కోరారు. ఎన్టీపీసీలో అక్రమాలు జరుగుతున్నాయని, వైసీపీ నాయకులు బ్రోకర్లుగా తయారై ఒక్కొక్కరి నుంచి ఐదు నుంచి ఆరు లక్షల రూపాయల చొప్పున వసూలు చేసి మెయింటెనెన్స్ ఉద్యోగాలు అమ్ముకుంటున్నారన్నారు. పంచకర్ల రమేశ్‌బాబు విజయానికి టీడీపీ కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. తాను మాడుగుల నుంచి పోటీ చేస్తున్నప్పటికీ ఎల్లప్పుడూ పెందుర్తి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పెందుర్తి జనసేన అసెంబ్లీ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ బండారు సలహాలు, సూచనలు తప్పకుండా పాటిస్తానన్నారు. ఐదేళ్లపాటు టీడీపీ కార్యకర్తలను వేధించిన వైసీపీ నాయకులను ఎట్టి పరిస్థితుల్లోనూ జనసేనలోకి చేర్చుకోబోమని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం సీఎం రమేశ్‌ను బండారు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, పెందుర్తి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీ మాజీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు ఆస్తులు రూ.8.32 కోట్లు

ఎలమంచిలి, ఏప్రిల్ 18: ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ నామినేషన్ సందర్భంగా తన ఆస్తులు, అప్పుల వివరాల అఫిడవిట్‌ను ఎన్నికల అధికారులకు సమర్పించారు. తన పేరున, కుటుంబ సభ్యుల పేరుతో రూ.8.32 కోట్లు ఆస్తులు ఉన్నట్టు చూపించారు. విజయ్‌కుమార్ పేరున మూడు బ్యాంకుల్లో రూ.1.89 కోట్లు గృహ అప్పులు ఉన్నట్టు పేర్కొన్నారు. విజయ్‌కుమార్ పేరున చరాస్తి రూ.3.98 కోట్లు, స్థిరాస్తి రూ.2.4 కోట్లు ఉన్నట్టు పేర్కొన్నారు. విశాఖలో రుషికొండలో ఆయన పేరున రెండు ఇళ్లు, అచ్యుతాపురం మండలం చోడిపల్లిలో ఒక ఇల్లు ఉన్నాయి. భార్య శైలజ పేరుతో రూ.53 లక్షల చరాస్తి, కుమార్తె సుకీర్తి పేరుతో రూ.22 లక్షలు, మరో కుమార్తె నేహశ్రీ లక్ష్మి పేరుతో రూ.18 లక్షలున్నట్టు పేర్కొన్నారు. విజయ్‌కుమార్ పేరున బ్యాంకు డిపాజిట్లు రూ.3.06 లక్షలు, భార్య పేరున రూ.12.85 లక్షలు, కుమార్తె పేరున రూ.1.36 లక్షలు డిపాజిట్లు ఉన్నట్టు, చిన్న కుమార్తె పేరుతో రూ.22 వేలు డిపాజిట్ ఉన్నట్టు పేర్కొన్నారు. విజయ్‌కుమార్ వద్ద నగదు రూ.4.53 లక్షలు, భార్య వద్ద రూ.2.37 లక్షలు నగదు ఉన్నట్టు తెలిపారు. కుమార్తె చేతిలో నగదు రూ.36 వేలు ఉన్నట్టు చూపారు. విజయ్‌కుమార్ వద్ద రూ.6.85 లక్షలు విలువైన 232 గ్రాముల బంగారం ఉందని, చిన్న కుమార్తె పేరున రూ.15 లక్షలు విలువైన 209 గ్రాముల బంగారం ఉందని తెలిపారు. విజయ్‌కుమార్ పేరుతో కార్లు ఏమీ లేవని, ఒక మహేంద్ర బొలేరో మాత్రమే ఉందని, దీని విలువ రూ.2.61 లక్షలుగా చూపారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


పార్టీ కండువా వేసి ఆహ్వానించిన రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 18: కశింకోట మండలం నర్సింగబిల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు అనకాపల్లి డీవీఆర్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. పాల సంఘం మాజీ అధ్యక్షులు, వైసీపీ సచివాలయ కన్వీనర్ కోన వీర వెంకట సత్యనారాయణ, వార్డు మెంబరు, గ్రామ సచివాలయ కన్వీనర్ గొంతిన నూకేష్‌లకు కండువాలను రత్నాకర్ వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేగి దొరబాబు, బెజవాడ రాజు పాల్గొన్నారు.

18 మంది వలంటీర్లు రాజీనామా

చీడికాడ, ఏప్రిల్ 18: మండలంలోని రెండు పంచాయతీల నుంచి 18మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి గురువారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. కోనాం పంచాయతీ నుంచి 13మంది, తునివలస పంచాయతీ నుంచి ఐదుగురు రాజీనామా పత్రాలు అందజేసినట్టు చెప్పారు.

మార్కెట్‌యార్డులో నిలిచిన బెల్లం లావాదేవీలు


బెల్లం దిమ్మలు రాక బోసిపోయిన ప్లాట్‌ఫారం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 18: స్థానిక ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులో బెల్లం లావాదేవీలు గురువారం స్తంభించిపోయాయి. వర్తకులకు, కొలగార్ల మధ్య తలెత్తిన సమస్య కారణంగా లావాదేవీలు ఆగిపోయాయి. ఏ రోజుకు ఆ రోజు కొలగార్లకు తమ కొలగారం (వేతనం) ఇవ్వాలని కొలగార్ల సంఘం ప్రతినిధి దాడి భోగలింగం చెబుతున్నారు. ఇటీవల యార్డులో బెల్లం దిమ్మలు పోయాయని, దానికి తమ కొలగారం నుంచి వర్తకులు డబ్బులు కట్ చేస్తున్నారని చెబుతున్నారు. మార్కెట్ రూల్స్ ప్రకారం సాయంత్రం ఐదు గంటల వరకే పనిచేయాలని అయినా ఎనిమిది గంటల వరకు దుకాణాల వద్దే ఉంటున్నామని చెబుతున్నారు. వేలం పాటలో వర్తకులు పాడుకున్న బెల్లం రవాణా అయ్యే వరకు కొలగార్లే కాపాలా ఉండాలని వర్తకులు అంటున్నారని పేర్కొన్నారు. కొలగారం ఎప్పటి మాదిరిగానే వారానికి ఒకసారి ఇస్తామని వర్తకులు చెబుతున్నారన్నారు. ఏ రోజుకు ఆ రోజే ఇవ్వాలని తాము కోరుతున్నామన్నారు. ఎన్నికల సమయం కావడం వల్ల కొద్ది రోజులు ఆగిన తర్వాత కూర్చొని సమస్యలు పరిష్కరించుకోవచ్చనని వర్తకులు చెబుతున్నారని మార్కెట్ కమిటీ సెక్రటరీ శకుంతల చెబుతున్నారు. ఏది ఏమైనా సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. కాగా గురువారం రైతులు మార్కెట్‌కు బెల్లం తీసుకురాకపోవడంతో లావాదేవీలు నిలిచిపోయాయి.

అభిమాని వీరాభిమానం

▸▸ పెళ్లి శుభలేఖలో పవన్‌కల్యాణ్, నేతల ఫొటోలు


పెళ్లి శుభలేఖలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్, ఇతర నాయకుల ఫొటోలు

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 18: సహజంగా వివాహానికి ముద్రించే శుభలేఖల్లో తమ ఆరాధ్య దైవం, తల్లిదండ్రుల ఫొటోలను ముద్రించుకోవడం ఆనవాయితీ. కానీ ఆ వీరాభిమాని తన అభిమాన నటుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఫొటోతోపాటు ఇతర నేతల ఫొటోలను ముద్రించి తన అభిమానాన్ని చాటుకున్నాడు భట్లపూడి గ్రామానికి చెందిన బాదంపూడి శ్రీనివాసరావు. ఈయన వివాహం ఈనెల 21 తేదీన జరగనుంది. తన వివాహ శుభలేఖలో పవన్ కల్యాణ్ ఫొటోతోపాటు జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఫొటోలను ముద్రించుకున్నాడు.

చోడవరంలో సీఎం జగన్ సిద్ధం సభ వాయిదా

చోడవరం, ఏప్రిల్ 18 : పట్టణంలో సీఎం జగన్ శనివారం తలపెట్టిన సిద్ధం సభ వాయిదాపడింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన ప్రాంతాల్లో సీఎం ఇటువంటి సభలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ఈనెల 20న చోడవరంలో నిర్వహణకు వైసీపీ నాయకులు సన్నాహాలు చేపట్టారు. చోడవరం- అనకాపల్లి ప్రధాన రహదారిలోని కొత్తూరు జంక్షన్‌కు సమీపం పంట పొలాల్లో సభా వేదిక కోసం పొలాలను చదును చేశారు. ఈ నేపథ్యంలో సభ వాయిదాపడినట్టు స్థానిక వైసీపీ నాయకులకు సమాచారం అందింది. దండకారణ్యంలో మావోయిస్టులపై భద్రతాదళాల దాడి నేపథ్యంలో పోలీసులు సిద్ధం సభకు అనుమతి ఇవ్వలేనట్టు ప్రచారం జరుగుతున్నది. దీనిపై ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల సిద్ధం సభ వాయిదాపడిందని, మరో వారం పది రోజుల్లో ఈ ప్రాంతంలోనే సీఎం సభ ఉంటుందని వివరించారు.

టీడీపీలో చేరిన అక్కరమాని దంపతులు


చంద్రబాబుతో అక్కరమాని దంపతులు

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) మాజీ ఛైర్‌పర్సన్, తూర్పు నియోజకవర్గ వైసీపీ మాజీ ఇన్‌చార్జి అక్కరమాని విజయనిర్మల, ఆమె భర్త వెంకటరావు గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి అధినేత నారా చంద్రబాబునాయుడు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అక్కరమాని విజయనిర్మల 2019 ఎన్నికల్లో తూర్పు అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తరువాత ఏడెనిమిది నెలల కిందట వరకూ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. విజయనిర్మల దంపతులతో పాటు పద్మనాభం మాజీ ఎంపీపీ గోపీ రాజు, విశాఖ జిల్లా చిరంజీవి సేవా సంఘం అధ్యక్షులు దుక్క కృష్ణాయాదవ్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒమ్మి దేవుడు, మాజీ సర్పంచులు గేదెల చంద్రరావు, నమ్మి వెంకటరావు, జీవీఎంసీ 25వ వార్డు వైసీపీ అధ్యక్షుడు జి.సూర్యబాబు టీడీపీలో చేరారు.

AJC CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, BORASINGU KANAKA RAJU (Old Name), S/o. BORASINGH APPARAO, resident of 16-69, Srinivasanagar Colony, Madhurawada, Kommadi, Visakhapatnam. Change my name from BORASINGU KANAKA RAJU (Old Name) to BORASINGH KANAKARAJU (New Name). Hence forth I am being called as BORASINGH KANAKARAJU (New Name), S/o. BORASINGH APPARAO for all purposes.
AJV_182876

CHANGE OF NAME

★ I, LEKKALA LAXMAN RAO (Old Name), S/o. LEKKALA SUBRAMANYAM, resident of 8-93/5, Marrichettula Colony, Pendurthi, Visakhapatnam. Change my name from LEKKALA LAXMAN RAO (Old Name) to LEKKALA LAKSHMANA RAO (New Name). Hence forth I am being called as LEKKALA LAKSHMANA RAO (New Name), S/o. LEKKALA SUBRAMANYAM for all purposes.
AJV_182877

CHANGE OF NAME


★ I, NANDAMUDI LAKSHMI (Old Name), W/o. NANDAMUDI SYAM SUNDAR RAO, resident of 57-14-23, Subhash Nagar, Kancharapalem, Visakhapatnam. Change my name from NANDAMUDI LAKSHMI (Old Name) to NANDAMUDI LAXMI (New Name). Hence forth I am being called as NANDAMUDI LAXMI (New Name), W/o. NANDAMUDI SYAM SUNDAR RAO for all purposes.
AJV_182878

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093

ఒకనాటి బెస్తవారి పల్లె నేడు మహానగరంగా విస్తరించింది. పలు రంగాల్లో ప్రగతి పయనాన్ని కొనసాగిస్తోంది. విద్య, వైద్యం, పర్యాటక, పారిశ్రామిక రంగాలతో పాటు జనాభా రీత్యా, రాజకీయంగా పలు మార్పులకు విశాఖ ప్రభావితమయింది. 1952లో జరిగిన తొలి శాసన సభ ఎన్నికల నాటికే విశాఖపట్నం నియోజకవర్గంగా గుర్తింపు పొందింది. ఆ ఎన్నికల్లో కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ తరఫున పోటీచేసిన తెన్నేటి విశ్వనాథం గెలుపొంది శాసనసభలో అడుగుపెట్టిన మొదటి వ్యక్తి. 1952 అక్టోబరులో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత టంగుటూరి ప్రకాశం పంతులు కేబినెట్‌లో తెన్నేటి విశ్వనాథం ఆర్థిక మంత్రిగా పనిచేశారు. 1953లో విశాఖ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో ప్రజా సోషలిస్టు పార్టీ తరఫున తిరిగి తెన్నేటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1955లో మధ్యంతర ఎన్నికల్లో ఏవీబీ రావు, కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేసి ఎన్నికయ్యారు. 1962లోనూ ఇదే పార్టీ నుంచి ఆయన మళ్లీ గెలుపొందారు.



నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు	2,76,523
పురుషులు	1,35,516
మహిళలు	1,40,990
ఇతరులు	17 మంది

విశాఖ తూర్పు... విశిష్టం!

- మేధావులు, విద్యావంతులకు నిలయం
- మూడు దఫాలుగా టీడీపీకి ఆదరణ

1967 ఎన్నికల నుంచి విశాఖ రెండు శాసనసభ నియోజకవర్గాలుగా ఏర్పడింది. 2004 ఎన్నికల వరకూ విశాఖ 1, విశాఖ 2 ఉండగా, దేశ వ్యాప్తంగా జరిగిన డీలిమిటేషన్ కారణంగా 2009 సాధారణ ఎన్నికల నాటికి విశాఖ నగరం ఐదు శాసనసభ నియోజకవర్గాలుగా రూపాంతరం చెందింది. విశాఖ 1, 2లను రద్దు చేసి వాటి స్థానంలో విశాఖ దక్షిణ, తూర్పు నియోజకవర్గాలు ఏర్పడ్డాయి.

విశాఖ తూర్పు స్థానానికి జరిగిన తొలి శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి పోటీచేసిన వెలగపూడి రామకృష్ణబాబు 44,233 ఓట్లు సాధించారు. ఆ ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 2,02,447 మంది కాగా, 1,38,104 ఓట్లు పోలయ్యాయి. వెలగపూడి రామకృష్ణబాబు తన సమీప ప్రత్యర్థి ప్రజారాజ్యం అభ్యర్థి చెన్నుబోయిన శ్రీనివాస్‌పై 4,031 ఓట్లు ఆధిక్యత సాధించారు. రెండోసారి 2014లో జరిగిన ఎన్నికల్లో వెలగపూడికి 1,00,624 ఓట్లు లభించాయి. సమీప వైసీపీ అభ్యర్థి చెన్నుబోయిన శ్రీనివాస్‌పై 47,883 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మూడోసారి తూర్పులో జరిగిన 2019 ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ గాలి విచినా, విశాఖ తూర్పులో మాత్రం తెలుగుదేశం హ్యాట్రిక్ విజయం సాధించి, వెలగపూడి మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తెలుగుదేశానికి రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 23 సీట్లు రాగా అందులో తూర్పు ఒకటి కావడం విశేషం. ముఖ్యమైన విషయం ఏమిటంటే అంతటి వైసీపీ గాలిలోనూ 76,504 ఓట్లు సాధించి, సమీప అభ్యర్థి అక్కరమాని విజయనిర్మలపై 23,635 ఓట్ల మెజారిటీ సాధించారు. ఇక ఈ స్థానం నుంచి 2009లో కాంగ్రెస్ పార్టీ మూడో స్థానానికి పరిమితం కాగా, 2014, 2019లో డిపాజిట్లు కూడా తెచ్చుకోలేదు. రాష్ట్ర విభజన ఆ పార్టీపై తీవ్ర ప్రభావం చూపించింది. 2014లో తెలుగుదేశంతో జత కట్టిన భారతీయ జనతా పార్టీ 2009, 2019లో డిపాజిట్లు కోల్పోవడం పెద్దగా వింతేమీ కాలేదు.

విశాఖ తూర్పులో మేధావులు, విద్యావంతులు అధికంగా ఉన్నారు. అన్ని వసతులు, సౌకర్యాలతో ఎంవీపీ కాలనీ 12 సెక్టార్లలో విస్తరించింది. విశాలాక్షినగర్, లాసన్స్‌బే కాలనీ, సిరిపురం తదితర ప్రాంతాల్లో విద్యావంతులు, ఉద్యోగులు అధికం. ఆరిలోవ ఐదు సెక్టార్లలో విస్తరించి ఉండగా ఈ ప్రాంతంలో మధ్య, దిగువ, కింది స్థాయి కుటుంబాలు ఉంటున్నాయి. ఆంధ్రాయూనివర్సిటీ, గీతం యూనివర్సిటీల్లో పనిచేసేవారు ఎక్కువగా తూర్పులోనే నివసిస్తున్నారు. హనుమంతువాక నుంచి ధారపాలెం వరకూ కొండవాలు ప్రాంతాలు, హెల్త్‌సిటీ ఉన్నాయి. విశాఖ వ్యాలీ, సత్యసాయి వంటి ప్రముఖ పాఠశాలలు ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. ప్రధానంగా ఉత్తరాంధ్ర నుంచి వలస వచ్చిన ప్రజలు, భవన నిర్మాణ కార్మికుల్లో అత్యధిక శాతం మంది ఇక్కడే జీవిస్తున్నారు. అభ్యర్థుల గెలుపు, ఓటముల్లో వీరి పాత్ర చాలా కీలకమైనది.



● ఎంవీపీ కాలనీ



వెలగపూడి రామకృష్ణబాబు

వెలగపూడి హ్యాట్రిక్

నియోజకవర్గం ఆవిర్భావం తర్వాత మూడుసార్లు వరుసగా ఎన్నిక

తూర్పు నియోజకవర్గం... 2008లో ఆవిర్భవించింది. అంతకు ముందు పెందుర్తి నియోజకవర్గంలో భాగమై ఉన్న కొంత ప్రాంతం, విశాఖ రెండో నియోజకవర్గంలోని కొంత ప్రాంతాన్ని తూర్పు నియోజకవర్గంగా ఏర్పాటుచేశారు. ఇక్కడ 2,72,215 మంది ఓటర్లున్నారు. ఆవిర్భావం నుంచి మూడు సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 2009, 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో మూడుసార్లు విజేతగా వెలగపూడి రామకృష్ణబాబు నిలిచారు.

తూర్పు నియోజకవర్గం పేరిట 2009లో మొదటిసారి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. తెలుగుదేశం పార్టీ నుంచి వెలగపూడి రామకృష్ణబాబు, ప్రజారాజ్యం నుంచి చెన్నుబోయిన శ్రీనివాసరావు (వంశీకృష్ణ శ్రీనివాస్), కాంగ్రెస్ తరఫున ఉరుకూటి అప్పారావు, లోక్‌సత్తా నుంచి ఝాన్సీ లక్ష్మి, భారతీయ జనతా పార్టీ నుంచి కె.రాజకుమారి పోటీ చేశారు. ఇందులో వెలగపూడి రామకృష్ణబాబు తన సమీప ప్రత్యర్థి వంశీ కృష్ణ శ్రీనివాస్‌పై 4 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి ఉరుకూటి అప్పారావుకు 38,098 ఓట్లు రావడం విశేషం. లోక్‌సత్తా అభ్యర్థిని ఝాన్సీలక్ష్మికి కూడా పదివేల ఓట్లు రావడం గమనార్హం. బీజేపీకి కేవలం 2,218 ఓట్లు వచ్చాయి. నియోజకవర్గం ఏర్పాటుతోనే వెలగపూడి విజేతగా బోణీ కొట్టారు. ఆ తరువాత 2014లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం తరఫున వెలగపూడి రెండో సారి పోటీ పడగా, ప్రజారాజ్యం నుంచి వైసీపీలోకి వచ్చిన వంశీకృష్ణ బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో వెలగపూడి 1.62 లక్షల ఓట్లు సాధించగా వంశీకృష్ణ కు 52,741 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. వెలగపూడికి 47,883 ఓట్ల రికార్డు మెజారిటీ లభించింది. ఇక 2019లో మూడోసారి జరిగిన ఎన్నికల్లో వెలగపూడి బరిలో ఉండగా, వైసీపీ అక్కరమాని విజయ నిర్మలను రంగంలోకి దించింది. జనసేన పార్టీ కోన తాతారావును అభ్యర్థిగా నిలిపింది. ఈ సారి వెలగపూడి అక్కరమాని విజయనిర్మలపై 26,474 ఓట్ల మెజారిటీతో గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. కోన తాతారావుకు 17,873 ఓట్లు రాగా, విజయనిర్మలకు 60,599ఓట్లు వచ్చాయి. నాలుగోసారి జరుగుతున్న ఈ ఎన్నికల్లో కూటమి తరఫున పోటీలో దిగి, మరోసారి సత్తా చాటాలని వెలగపూడి ప్రయత్నిస్తుండగా, వైసీపీ నుంచి ఎంవీవీ సత్యనారాయణ పోటీ చేస్తున్నారు. ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడం ఈ సారి విశేషం.

మీకు తెలుసా...?

రెండో ఈవీఎంను ఎప్పుడు వినియోగిస్తారంటే!

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 18: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్‌ల స్థానం లో ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లను వినియోగిస్తున్న విషయం తెలిసిందే. ఒక నియోజకవర్గంలో 16 మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే రెండో ఈవీఎంను వినియోగించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఒక ఈవీఎంలో 16 మంది వివరాలు మాత్రమే రికార్డు చేసేందుకు వీలుంటుంది. అంతకన్నా ఎక్కువ మంది బరిలో ఉంటే తప్పకుండా మరో ఈవీఎంను ఉపయోగించాలి. ఉదాహరణకు 18 మంది అభ్యర్థులు రంగంలో ఉంటే మొదటి ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల వివరాలు, రెండో ఈవీఎంలో ఇద్దరు వివరాలు ఉంచుతారు. దీంతో పాటు ఏ పోలింగ్ బూత్‌లోనైనా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత మధ్యలో ఈవీఎం మొరాయిస్తే అప్పటివరకు నమోదైన వివరాలను సీల్ చేసి, రెండో ఈవీఎంను వినియోగిస్తారు.




అనుమతులన్నీ సువిధలోనే!

- ఎన్నికల కమిషన్ కొత్త పోర్టల్

ఆర్‌ఓలకు మాన్యువల్‌గా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు

అనకాపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు జరగకుండా ఎన్నికల సంఘం పక్కాగా ఏర్పాట్లు చేసింది.. సాంకేతికతను జోడించి ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేయడమే కాకుండా ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీలు.. నామినేషన్ల దాఖలు నుంచి ర్యాలీలు, ఎన్నికల ప్రచారానికి అనుమతులు, తదితర వాటికి సంబంధించి సువిధ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు పరిశీలించి 48 గంటల్లో అనుమతులు జారీ చేస్తారు. అన్నిరకాల ప్రచార అనుమతులకు అభ్యర్థులు ముందుగా https/suvidha.eci.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. అయితే ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు మాన్యువల్‌గా కూడా దరఖాస్తులు చేసుకున్నా అనుమతులు ఇస్తారు.



సువిధ పోర్టల్

వీటికి సువిధలో అనుమతులు పొందొచ్చు..

సమావేశాలు, సభలు, ర్యాలీలు, ప్రచార వాహనాలు, తాత్కాలికంగా పార్టీ కార్యాలయాల ఏర్పాటు, ముఖ్యనేతల పర్యటనలకు హెలీప్యాడ్‌ల ఏర్పాటు, ఇంటింటి ప్రచారం, బ్యానర్లు, పార్టీ జెండాలు, ఎయిర్ బెలూన్‌లు, వీడియో వ్యాన్‌లు, హోర్డింగ్‌ల ఏర్పాటు, కరపత్రాల పంపిణీ వంటి వాటి కోసం సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాల్సి ఉంటుంది. సువిధ పోర్టల్ ద్వారా కాకుండా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకుని 48 గంటల్లో అనుమతులు పొందవచ్చు.

ఓటరు మాట



సమాజంపై అవగాహన ఉండాలి



సమాజంపై పూర్తి అవగాహన ఉన్న వారినే చట్టసభలకు ఎన్నుకోవాలి. అన్ని రాజకీయపార్టీలు ఇలా ఆలోచించగలిగితే రాజకీయాలు, ప్రభుత్వాల్లో మంచి మార్పులు వస్తాయి. కొత్త ఆలోచనలతో ఉన్న యువతరం రాజకీయాల్లోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నది. వారసత్వ రాజకీయాల వల్ల ఇలాంటి వారికి అవకాశాలు రావడం లేదు. ఓటర్లు కూడా రాజకీయ వారసత్వాన్ని ప్రోత్సహించకూడదు.

- కరుకు రమేష్ చంద్ర, హెచ్‌పీసీఎల్ కార్మికుడు, మల్కాపురం

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి



అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా అమలుచేసే పార్టీని ఎన్నుకోవాలి. సంక్షేమానికే లేదా అభివృద్ధికే ప్రాధాన్యమిచ్చినా రాష్ట్ర ప్రగతి కుంటుపడుతుంది. దీనిపై అవగాహన ఉన్న నాయకులను ప్రజాప్రతినిధులుగా చట్టసభలకు పంపిస్తే అధికాదాయ, అల్పాదాయ, పేదవర్గాల వారు ప్రగతి సాధించే అవకాశం ఉంది. ఎన్నికల్లో ఇలాంటి అభ్యర్థులను గెలిపించుకుందాం.

- జోస్యుల పవన్‌శ్రీకర్, విద్యార్థి, అనకాపల్లి

ఆర్థిక విధానాలపై అవగాహన అవసరం



ప్రజాప్రతినిధులకు ఆర్థిక, పారిశ్రామిక విధానాలపై అవగాహన ఉండాలి. అధికార దర్పం, ఆస్తుల పరిరక్షణ, నేరాలనుంచి తప్పించుకునేందుకు రాజకీయాలు చేసే నేతలను తిరస్కరించాలి. వ్యవసాయం, పరిశ్రమలు, స్వయం ఉపాధి, యువతకు నైపుణ్య శిక్షణ, మహిళలకు ఆర్థిక స్వావలంబన వంటి అంశాలపై దృష్టి సారించగల వారిని ఎన్నుకుంటేనే అభివృద్ధి సాధ్యం.

- బి.సాధూరెడ్డి, ట్రేడ్ యూనియన్ నేత, పెదగంట్యాడ

మహిళా సాధికారతకు పెద్దపీట వేయాలి



విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో మహిళలను ప్రోత్సహించే నాయకుడు కావాలి. మహిళా పురోగతికి పథకాలను రూపొందించే వ్యక్తి ఎమ్మెల్యే, ఎంపీ అయితే సాధికారత సాధ్యమవుతుంది. దీనివల్ల కుటుంబాలు, సమాజం, రాష్ట్రం బాగుపడతాయి. మహిళలకు రక్షణ కల్పించే ప్రభుత్వం కావాలి. తాయిలాలకు ఓటును తాకట్టు పెట్టుకుంటే మనల్ని మనమే మోసం చేసుకున్నట్టు.

- పెద్దాడ వెంకటపద్మశ్రీ, గాజువాక

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుంటున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్... 9848212243

దటీజ్ దిమిలి!

ఒకే గ్రామం నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు

వీరిలో ఒకరు ఎంపీగా, ఎమ్మెల్సీగా కూడా ఎన్నిక

ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఎలమంచిలి నుంచి పప్పల బాపునాయుడు ప్రాతినిధ్యం

- 1967 ఎన్నికల్లో నగిరెడ్డి సత్యనారాయణ గెలుపు
- 1985 నుంచి 1999 వరకు వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా విజయంసాధించిన పప్పల చలపతిరావు
- 2004లో అనకాపల్లి ఎంపీ, తరువాత శాసన మండలికి ఎన్నిక
- టీటీడీ, గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా సేవలు
- ఓటమి ఎరుగని నేతగా అరుదైన రికార్డ్ సొంతం





దిమిలి గ్రామం. (ఇన్‌సెట్) గ్రామం బోర్డు

ఎలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలంలోని దిమిలి గ్రామానికి ఎన్నో ప్రత్యేకతలు వున్నాయి. స్వాతంత్ర్య సమరయోధులకు ఇది పురిటిగడ్డ. ఈ గ్రామం నుంచి ముగ్గురు వ్యక్తులు ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీగా, లోక్‌సభ సభ్యునిగా ఎన్నికయ్యారు. వీరిలో పప్పల చలపతిరావును ప్రముఖంగా చెప్పుకోవాలి. ఆయన తెలుగుదేశం పార్టీ తరఫున వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఒకసారి అనకాపల్లి ఎంపీగా గెలిచారు. మరోసారి శాసనమండలి సభ్యునిగా ఎన్నికయ్యారు. ఓటమి ఎరుగని నేతగా రికార్డుల్లో నిలిచారు. వీరంతా కాంగ్రెసేతర పార్టీల నుంచి ప్రాతినిధ్యం వహించడం మరో విశేషం.

దిమిలి గ్రామానికి చెందిన పప్పల బాపునాయుడు ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కృషికార్ లోక్ పార్టీ తరఫున పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి మిస్సుల సూర్యనారాయణమూర్తిపై విజయం సాధించారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. ఇదే గ్రామానికి చెందిన నగిరెడ్డి సత్యనారాయణ 1967లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి వీసం సన్యాసినాయుడుపై విజయం సాధించారు. సత్యనారాయణ 1978లో జనతా పార్టీ తరఫున పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి వీసం సన్యాసినాయుడు చేతిలో ఓడిపోయారు. ఆ తరువాత నుంచి క్రియాశీల రాజకీయాలకు దూరంగా వున్నారు. దిమిలి గ్రామానికే చెందిన పప్పల చలపతిరావు పలు రికార్డులు సాధించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో వున్న ఆయన వరుసగా 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో ఎలమంచిలి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీటీడీ చైర్మన్‌గా, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్‌గా కూడా పనిచేశారు. 2004 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి లోక్‌సభకు పోటీ చేసి విజయం సాధించారు. తరువాత ఆరేళ్లపాటు శాసనమండలి సభ్యునిగా పనిచేశారు. బాపునాయుడు, చలపతిరావు, సత్యనారాయణ దగ్గర బంధువులు కావడం విశేషం. పప్పల చలపతిరావుకు బాపునాయుడు పెదనాన్న కాగా, సత్యనారాయణ మేనమామ అవుతారు.



పప్పల బాపునాయుడు



నగిరెడ్డి సత్యనారాయణ



పప్పల చలపతిరావు

స్వాతంత్ర్య సమరయోధులు

దిమిలి చెందిన ఎంతో మంది స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. వీరిలో శిష్టా రామదాస్, కళానాథభట్ల జగన్నాథచయనులు, శిష్టా పురుషోత్తం, యల్లాయి అప్పలనరసింహం, శానాపతి అప్పలనాయుడు, నేమాని సత్యనారాయణ తదితరులు స్వాతంత్ర్య సమరయోధులుగా ప్రభుత్వ రికార్డుల్లో నమోదయ్యారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో వీరి పేర్లతో ఒక శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు.



ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుల పేర్లతో ఏర్పాటు చేసిన స్థూపం

● ఎలమంచిలి

గంటా ఆస్తులు రూ.23.37 కోట్లు

- ఆయన పేరుతో రూ.16.31 కోట్లు
- అప్పులు రూ.1.16 కోట్లు
- భార్య పేరిట రూ.7.06 కోట్లు



విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు భీమిలి నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా గురువారం నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన సమర్పించిన అఫిడవిట్‌లో భార్యాభర్తల పేరు మీద ఉన్న ఆస్తులు, అప్పుల వివరాలు సమర్పించారు. ఆయన పేరిట చరాస్తులు రూ.8,39,87,421 ఉండగా, స్థిరాస్తులు రూ.7,90,66,359 చూపించారు. రెండూ కలిపి రూ.16,30,53,780. ఇకపోతే ఆయన భార్య శారద పేరుతో చరాస్తులు రూ.2,96,84,154, స్థిరాస్తులు రూ.4,09,49,512 చూపించారు. రెండూ కలిపి రూ.7,06,33,666. ఇద్దరి ఆస్తులు కలిపి రూ.23,36,87,446.

రుణాలు

అప్పుల విషయానికి వస్తే గంటా శ్రీనివాసరావు ప్రకాశం జిల్లా కామేపల్లిలో పంట రుణం కింద యుబీఐ నుంచి రూ.29,97,62 తీసుకున్నారు. భార్య శారదా తన బంగారు ఆభరణాలు తనఖా పెట్టి ఎంవీపీ కాలనీలోని ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రూ.85,80,571 రుణం తీసుకున్నారు. ఇద్దరికీ కలిపి రూ.1,15,78,195 అప్పులు ఉన్నాయి.

ఇవీ ఆస్తుల వివరాలు

గంటా శ్రీనివాసరావు చరాస్తుల కింద బ్యాంకుల్లో డిపాజిట్లు, షేర్లు, ఎల్ఐసీ బాండ్లు చూపించారు. భార్య తన వద్ద ఉన్న హారాలు, నెక్లెస్లు, వడ్డాణం తదితర బంగారు ఆభరణాలన్నీ కలిపి 2,258 గ్రాములుగా పేర్కొన్నారు. వాటి విలువ రూ.1.13 కోట్లుగా చూపించారు.

- వ్యవసాయ భూమి, నివాస భూమి, భవనాల వివరాలు వెల్లడించారు. ఎంవీపీ కాలనీలో ఇల్లు, బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఫ్లాటు, కృష్ణా జిల్లాలో ఇంటి స్థలం, ప్రకాశం జిల్లాలో వ్యవసాయ భూములు చూపించారు.

కేఏ పాల్‌పై ఆరు క్రిమినల్ కేసులు

తన వద్ద రూ.1.86 లక్షల నగదు ఉన్నట్టు పేర్కొన్న ప్రజా శాంతి అధ్యక్షుడు



విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ లోక్‌సభ స్థానానికి గురువారం నామినేషన్ దాఖలు చేసిన ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కిలారి ఆనంద్‌పాల్ (కేఏ పాల్)...తనపై ఆరు క్రిమినల్ కేసులు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు పోలీస్ స్టేషన్ (క్రైమ్ నంబరు 229/2012), విజయనగరం జిల్లా ఎల్.కోట (ఎఫ్ఐఆర్ నంబరు 59/2024), తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా అడ్డకల్ (ఎఫ్ఐఆర్ నంబర్ 10/2010), రాజన్న సిరిసిల్లా జిల్లా తంగళ్లపల్లి (ఎఫ్ఐఆర్ నంబరు 99/2022), నల్లగొండ జిల్లా మునుగోడు (ఎఫ్ఐఆర్ నంబరు 122(2022), సిద్ధిపేట స్టేషన్ (ఎఫ్ఐఆర్ నంబరు 166/2022)లలో ఒక్కొక్క కేసు ఉంది. ఇదిలావుండగా తన వద్ద రూ.49 వేలు, హెడ్‌సీఎఫ్‌సి బ్యాంకు అక్కయ్యపాలెం బ్రాంచి, ఫెడరల్ బ్యాంకు విశాఖ, సికింద్రాబాద్ బ్రాంచీల్లో గల ఖాతాల్లో రూ.1,37,071...మొత్తం రూ.1,86,071 నగదు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తనకు స్థిరాస్తులు, వాహనాలు లేవని పేర్కొన్నారు. కాగా 1981లో ఇంటర్ పాసైన పాల్...అనకాపల్లి ఏఎంఎఎల్ కళాశాలలో డిగ్రీలో చేరి చదువుకు స్వస్తి పలికారు.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయండి

» అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

కొత్తూరు, ఏప్రిల్ 18: రానున్న లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కోరారు. గురువారం బీజేపీ కార్యాలయంలో పలువురు ప్రముఖులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి అద్భుతమైన ఆదరణ లభిస్తోందన్నారు. తనను, ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే కూటమమి అభ్యర్థులను గెలిపించుకోవడంలో మేధావులు, ప్రముఖుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పరుచూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బొజ్జన్నకొండ పనులను త్వరగా పూర్తి చేయాలి

తుమ్మపాల, ఏప్రిల్ 18: ప్రముఖ బౌద్ధ క్షేత్రం బొజ్జన్నకొండ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని సిద్దార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఒక ప్రకటనలో కోరారు. బొజ్జన్నకొండ వద్ద అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. తరచూ బొజ్జన్నకొండకు బౌద్దబిక్షువులు, పర్యాటకులు వస్తున్న సందర్భంగా వసతులు లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు.

ముగిసిన ఒకేషనల్ కోర్సు శిక్షణ

నక్కపల్లి, ఏప్రిల్ 18: మండలంలోని గొడిచెర్ల జడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు 12 రోజుల పాటు నిర్వహించిన వృత్తి విద్యా శిక్షణ కోర్సు తరగతులు (ఒకేషనల్ కోర్సులు) గురువారంతో ముగిశాయని హైస్కూల్ హెచ్ఎం రామ ప్రతాప్‌రావు చెప్పారు. విద్యార్థులకు కంప్యూటర్స్ శిక్షణ, పలు రకాల వృత్తి, విద్యాకోర్సుల్లో రాణించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వృత్తి విద్యా ఉపాధ్యాయుడు పి.విష్ణు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా డొంకాడ గ్రామంలో ఉద్యానవనశాఖ అసిస్టెంట్ రజత ఆధ్వర్యంలో ఈ విద్యార్థుల బృందం బొప్పాయి తోటల సాగును పరిశీలించింది.

సీతానగరంలో ఇంటింటా స్ప్రేయింగ్



సీతానగరంలో ఇంటింటా స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఏప్రిల్ 18: మండలంలోని గొడిచెర్ల పీహెచ్‌సీ పరిధి సీతానగరంలో గురువారం వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో స్ప్రేయింగ్ చేశారు. గతంలో ఈ గ్రామంలో డెంగ్యూ కేసు నమోదైంది. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు జిల్లా మలేరియా అధికారి వి.దొర, ఎలమంచిలి సబ్‌డివిజనల్ ఆఫీసర్ నాయుడు, ఎంపీహెచ్ఈవోలు యువీఎస్ రావు పర్యవేక్షణలో దోమల నివారణకు స్ప్రేయింగ్ చేశారు. కార్యక్రమంలో జీవీ రమణ, చక్రవర్తి, ఏఎస్ఎంపాల్గొన్నారు.

21న జిల్లాస్థాయి పాలిసెట్ మోడల్ టెస్ట్

ఎస్.రాయవరం, ఏప్రిల్ 18: మండలంలోని పెదగుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు పాలిసెట్ మోడల్ టెస్టును నిర్వహిస్తున్నట్టు పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులందరూ ముందుగా ఉచిత రిజిస్ట్రేషన్ చేసుకొని, మోడల్ టెస్టుకు హాజరు కావాలన్నారు. పాలిటెక్నిక్ మోడల్ టెస్ట్‌కు సంబంధించిన వివరాల కోసం 9700341744, 9381197776 నంబర్లను సంప్రదించాలని వారు తెలిపారు.

చినతీనార్లలో అనిత ఎన్నికల ప్రచారం



ఉపాధి పని చేస్తున్న అనిత

నక్కపల్లి, ఏప్రిల్ 18: మండలం చినతీనార్లలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగల పూడి అనిత గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. ఉపాధి కూలీలతో కలిసి ఉపాధి పనులు చేశారు. అనంతరం ఆమె ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఎన్‌డీఏ కూటమిని గెలిపించాలని కోరారు. అలాగే ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన 100 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. స్థానికంగా వున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనిత నివాసం వద్ద ఈ గ్రామానికి చెందిన పలువురు యువకులకు అనిత కండువా వేసి పార్టీలోని సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్, కురందాసు నూకరాజు, మేరుగు నాగేశ్వరరావు, నూకరాజు, తాతారావు, కొప్పిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

పాయకరావుపేటలో కూటమి శ్రేణుల ప్రచారం

పాయకరావుపేట/రూరల్, ఏప్రిల్ 18 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సీఎం.రమేశ్, వంగలపూడి అనితలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణంలోని ఏటిఒడ్డువీధి, తోకలవారివీధి తదితర ప్రాంతాల్లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో వంగలపూడి అనిత తనయుడు నిఖిల్, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, బీజేపీ నాయకుడు కువల కుమార్ తదితరులు టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతోపాటు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథం, చింతకాయల రాంబాబు, ఎం.రమాకుమారి, మజ్జూరి నారాయణరావు పాల్గొన్నారు. మండలంలోని పాల్మన్‌పేటలో జరిగిన ఎన్నికల ప్రచారంలో జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు యగదాసు నానాజీ, వేముల వెంకటరమణ, టీడీపీ నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా సుందరపు నామినేషన్

» జనసంద్రంగా ఎలమంచిలి పట్టణం

» రానున్నది ఎన్డీఏ కూటమే : సీఎం రమేశ్

» జనసందోహం విజయానికి నాంది : విజయకుమార్



నామినేషన్‌కు తరలివచ్చిన అభిమాన సందోహం నడుమ సుందరపు



కూటమి శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న సుందరపు విజయ్‌కుమార్

ఎలమంచిలి, ఏప్రిల్ 18: జనసేన ఎలమంచిలి అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ నామినేషన్ దాఖలుతో గురువారం పట్టణం జనసంద్రంగా మారింది. సుందరపు నామినేషను దాఖలు చేయడానికి ముందుగా స్వగ్రామం మామిడివాడ కొత్తూరులో తమ ఇలవేల్పు గుమ్మడి అమ్మలు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం తల్లిదండ్రుల దీవెనలు తీసుకున్న సుందరపు అచ్యుతాపురం నుంచి వేలాది మందితో ర్యాలీగా బయలుదేరారు. ఈ ర్యాలీకి రాంబిల్లి మండలం వెంకటాపురంలో పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యులు, జనసేన పార్టీ రాష్ట్ర ముఖ్య వ్యవహారాల ప్రతినిధి సుందరపు సతీష్‌లతో కలిసి ఎలమంచిలి చేరుకున్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి మనోరమకు సుందరపు విజయ్‌కుమార్, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం. రమేశ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్, సుందరపు గ్లాసు గుర్తు, కమలం గుర్తులతో ఉన్న సైకిల్‌ను కొంత దూరంపాటు తొక్కి అలరించారు. అనంతరం ప్రచార రథంపై నుంచి అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ మాట్లాడుతూ- రానున్నది ఎన్డీఏ కూటమేనని, కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబుల డబుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి దూసుకుపోనుందన్నారు. తాను అచ్యుతాపురంలోనే నివాసం ఉండడం జరుగుతుందని, స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు మాట్లాడుతూ అభిమానులు, కూటమి పార్టీ శ్రేణుల సమూహమే విజయానికి నాంది అన్నారు. రామరాజ్య స్థాపనే ధ్యేయంగా ముందుకు సాగుదామని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిద్దామన్నారు. అనంతరం ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు, బత్తుల తాతయ్యబాబు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దూలి రంగనాయకులు, కూటమి పార్టీల నేతలు గొర్లె నానాజీ, కొఠారు సాంబ, బొద్దపు శ్రీను, బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీను, కాండ్రకోట చిరంజీవి, లవుడు లోవరాజు, కొఠారు నరేష్, గుర్రాల శేఖర్, ఊడి బాబులు, రాజాన రమేష్, సన్యాసినాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌పీఐ అభ్యర్థిగా నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు

ఎలమంచిలి అసెంబ్లీ నియోజవర్గం నుంచి ఆర్‌పీఐ అభ్యర్థిగా మునిసిపాలిటీ తెరువుపల్లి వార్డుకు చెందిన బోజా నాగేశ్వరావు గురువారం నామినేషన్ ధాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి మనోరమకు తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈయన గత ఎన్నికల్లో కూడా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు.

అన్నవరంలో కూటమి అభ్యర్థులు ఎన్నికల ప్రచారం

కోటవురట్ల, ఏప్రిల్ 18: మండలంలోని అన్నవరంలో గురువారం రాత్రి అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారందరికీ అనిత కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ మాట్లాడుతూ కూటమి అధికారంలో వస్తే అభివృద్ధితోపాటు సంక్షేమం కొనసాగుతుందన్నారు. జిల్లాకు మంచి పరిశ్రమలు తీసుకువచ్చిన యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి అనిత మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత యువత భవిష్యత్తు అంధకారమైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, నాయకులు వేచలపు జనార్దన్, తిరుమలరావు, సింగంపల్లి శ్రీనివాసరావు, ముండల పార్టీ ప్రధాన కార్యదర్శి పెట్ల లింగంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి అనిత, మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప ఉన్నారు.



ఎలమంచిలి తహసీల్దారు కార్యాలయం సమీపంలో పోలీసు బందోబస్తు

నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు

ఎలమంచిలి, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల నామినేషన్లు వేసే స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. నామినేషన్ల స్వీకరణ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో జనాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని సీహెచ్‌సీ జంక్షన్ వద్ద, ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద పోలీసులు స్టాపర్లను ఏర్పాటు చేశారు. గురువారం జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ నామినేషన్ దాఖలు చేసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఇదే సమయంలో ఆస్పత్రి జంక్షన్ వద్ద స్టాపర్‌లను దాటి జనం రావడంతో పోలీసులు అప్రమత్తమై పరిస్థితిని చక్కదిద్దారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ సత్యనారాయణ, సీఐ ఎస్కే గఫూర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు.

పలు గ్రామాల్లో నేడు,రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తూరు, ఏప్రిల్ 18 : అనకాపల్లి మండలం కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలోని పలు గ్రామాల్లో శుక్ర, శనివారం రెండ్రోజులు పాటు విద్యుత్‌కు అంతరాయం వాటిల్లనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. కశింకోట సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీఏ ఫీడర్స్ వర్కు చేస్తున్న కారణంగా ఉదయం 7 నుంచి 11 గంటల వరకు కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణపురం, మూలపేట, వేట జంగాలపాలెం, సంపతిపురం, వెంకుపాలెం, రొంగలివానిపాలెం, కుంచంగి, కూండ్రం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

కశింకోటలో.. మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధిలో 33/11కేవీ నరసింగబిల్లి, కన్నూరుపాలెం సబ్ స్టేషన్ల పరిధిలో ఫీడర్స్ వర్క్ కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఉదయం 6.30 నుంచి 10.30 వరకు నర్సింగబిల్లి, ఎన్‌జీ.పాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, కొత్తపల్లి, ఏఎస్ పేట, సోమవరం, కన్నూరుపాలెం, తీడ, చెరకం, సుందరయ్యపేట, జి.భీమవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, ఏనుగుతుని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

ఎలమంచిలిలో.. ఎస్.రాయవరం మండలం దార్లపూడి సబ్ స్టేషన్ పరిధిలో కొత్తలి, ఏటికొప్పాక ఫీడర్‌ల పరిధిలో లైన్ నిర్వహణ పనుల్లో భాగంగా ఈనెల 19, 20 తేదీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ అధికారి తెలిపారు. ఈ కారణంగా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అవకాశం ఉన్నచోట ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, 12 గంటల నుంచి 3 గంటల వరకూ వ్యవసాయ కనెక్షన్‌లకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. కొత్తలి, పేరంటాలపాలెం, ములకలాపల్లి, మన్యంపాలెం, ఏటికొప్పాక గ్రామాలకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి

» కుమారుడికి గాయాలు

» ప్రమాదం నుంచి బయటపడిన భర్త, కుమార్తె



మృతి చెందిన శివేశ్వరి

లంకెలపాలెం, ఏప్రిల్ 18: పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్యాభర్తలకు గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో భార్య అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. కుమారుడుకి గాయాలు కాగా భర్త, కుమార్తె ప్రమాదం నుంచి బయట పడ్డారు. జాతీయ రహదారి లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్ద గురువారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకొంది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్స్‌లో పనిచేస్తున్న తలశిల అనిల్‌కుమార్, పెదముషిడివాడలో కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. భార్య శివేశ్వరి (34) కుమారుడు నిఖిల్ (8) కుమార్తె జశ్విక నలుగురు కలిసి ద్విచక్ర వాహనంపై అగనంపూడి పండగ కోసం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంపై వస్తుండగా లంకెలపాలెం పెట్రోల్ బంకు సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి గుర్తు తెలియని లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈప్రమాదంలో భార్య శివేశ్వరి వెనక్కి పడడంతో లారీ చక్రాలు ఆమె తలపై నుంచి వెళ్లి సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. కుమారుడు నిఖిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భర్త అనిల్‌కుమార్, కుమార్తె జశ్విక ప్రమాదం నుంచి బయటపడ్డారు. మృతదేహం వద్ద భర్త రోదించిన తీరు స్థానికులకు కంటతడి పెట్టించింది. మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీడిమామిడి రైతుకు ఎన్నికల కోడ్ దెబ్బ

... 5వ పేజీ తరువాయి



తోటల్లో సేకరించిన జీడిమామిడి పిక్కలు, పండ్లు

రైతులు వాపోతున్నారు. ఈ నెల మొదటి వారం నుంచి జీడి పిక్కలను సేకరించి ఎండ బెడుతున్నారు. తొలివిడత సేకరించిన జీడి పిక్కలను విక్రయించాలని భావిస్తుండగా, ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు రావడంలేదు. ఎన్నికల కోడ్ కారణంగా అధిక మొత్తంలో నగదు తీసుకెళ్లే పరిస్థితి లేకపోవడమే ఇందుకు కారణమని అంటున్నారు. దీంతో స్థానిక వ్యాపారులు (దళారులు) జీడిపిక్కల ధరలను అమాంతం తగ్గించేశారు. క్వింటా రూ.9 వేలకు మించి కొనుగోలు చేయడలేదు. గత ఏడాది క్వింటా జీడి పిక్కలు రూ.11-12 వేల వరకు కొనుగోలు చేశారని, ఈ ఏడాది దిగుబడి బాగా తగ్గినందున గిరాకీ ఏర్పడి క్వింటా రూ.12 వేలకు పైబడి ధర పలుకుతుందని రైతులు ఆశించారు. కానీ ఎన్నికల కోడ్ తమ ఆశలను ఆవిరి చేసిందని జీడిమామిడి రైతులు వాపోతున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేయించి రైతులకు గిట్టుబాటు కల్పిస్తామని చెప్పిన సీఎం జగన్మోహన్‌రెడ్డి.. ఐదేళ్ల పదవీ కాలంలో ఒక్క ఏడాది కూడా దీనిని అమలు చేయలేదని రైతులు గుర్తు చేస్తున్నారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన డీఎస్పీ



బందోబస్తు ఏర్పాట్లపై సూచనలిస్తున్న డీఎస్పీ అప్పారావు

నక్కపల్లి, ఏప్రిల్ 18: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నామినేషన్ల బందోబస్తు ఏర్పాట్లను డీఎస్పీ అప్పారావు గురువారం పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి 100 మీటర్లవరకూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. మూడు రోజుల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తారన్న సమాచారంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. గురువారం డీఎస్పీ అప్పారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసే రోజు హైవేపై ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సీఐలు విజయ్ కుమార్, అప్పన్న, అప్పలరాజులకు సూచించారు.

జబర్దస్త్ హైపర్ ఆది ఎన్నికల ప్రచారం



వ్యాపారులతో మాట్లాడుతున్న ఆది

కశింకోట, ఏప్రిల్ 18 : అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణకు మద్దతుగా గురువారం జబర్దస్త్ ఫేమ్ హైపర్ ఆది ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మెయిన్ రోడ్డులో ఉన్న వ్యాపార సముదాయాలకు వెళ్లి ప్రచారాన్ని చేశారు. గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అలాగే సంతలో పర్యటించి యువకులతో మాట్లాడారు. కశింకోట మెయిన్ రోడ్డు గుండా సంతబయలు కూడలి గుండా కాపువీధి, గొల్లపేట, కస్పావీధి, పూసర్ల వీధి, కుమ్మర వీధులలో డోర్ టు డోర్ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

కశింకోట, ఏప్రిల్ 18 : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం చలివేంద్రాన్ని వైద్యాధికారి తిరుపతిరావు ప్రారంభించారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో రోగుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. వడదెబ్బకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలని కోరారు.

సీఎం సభను విజయవంతం చేయండి : మలసాల

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 18: ఈనెల 20వ తేదీన కశింకోట మండలం గొబ్బూరు వద్ద జరిగే సీఎం జగన్మోహన్‌రెడ్డి సిద్ధం సభను విజయవంతం చేయాలని వైసీపీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ కోరారు. గురువారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ-మధ్యాహ్నం మూడు గంటలకు సభ జరగనుందన్నారు. ఈనెల 24న తాను నామినేషన్ దాఖలు చేయనున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, పార్టీ నాయకులు దిలీప్‌కుమార్, మందపాటి జానకిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల వ్యాపారి కోడూరు మృతి



అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 18: స్థానిక గాంధీమార్కెట్‌లో హోల్‌సేల్ కూరగాయల వ్యాపారి కోడూరు వెంకటరావు (58) గురువారం మృతిచెందినట్టు గౌరీ హోల్‌సేల్ కూరగాయల వర్తక సంఘం ప్రతినిధి వైఎన్ భద్రం తెలిపారు. వెంకటరావుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు. సంఘ నాయకులు సంతాపం తెలిపారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సబ్బవరం, ఏప్రిల్ 18: పెట్రోలు బంకులు నిర్వాహకులు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఫైరాఫీసర్ జీవీ సత్యరాజు సూచించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం అగ్నిప్రమాదాలు పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేసి, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది కె.రాజారావు, యల్లాజీ, ఎం. శ్యామ్‌కుమార్, మహేశ్వరరావు, ద్వారకాద్రి పాల్గొన్నారు.

మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థకు 13 మంది ఎంపిక

పాయకరావుపేట, ఏప్రిల్ 18 : స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రముఖ మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 13 మంది విద్యార్థులు ఎంపికైనట్టు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ తెలిపారు. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థ తమ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, వీరిలో 13 మంది ఉద్యోగావకాశాలు సాధించారన్నారు. విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావుతోపాటు అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

వైభవంగా బంగారుమాంబ పండుగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పరవాడ, ఏప్రిల్ 18 : మండలంలోని గొర్లివానిపాలెంలో బంగారుమాంబ అమ్మవారి పండగ గురువారం వైభవంగా జరిగింది. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. సర్పంచ్ గొర్లి అమ్ములు, స్థానిక నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాల ఊరేగింపు, అనుపోత్సవం నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. అలాగే బొద్దపువానిపాలెం దుర్గమాంబ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సర్పంచ్ బొద్దపు శ్రీనివాసు, కాసులు దంపతులు, మాజీ సర్పంచ్ బొద్దపు నూకరత్నం, నాయకులు మేడిశెట్టి అప్పారావు, మేడిశెట్టి బాలాజీనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బీవీపీ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 18 : ఈనెల 20 నుంచి ఉచిత వేసవి శిక్షణతరగతులు నిర్వహిస్తున్నట్టు కళ్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ కరస్పాండెంట్ ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో సంగీతం, కూచిపూడి నాట్యం, వెస్ట్రన్ డాన్స్, డ్రాయింగ్, పెయింటింగ్, కీబోర్డు, గిటార్‌ల్లో అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే శిక్షణ అందిస్తామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం ఎనిమిది నుంచి 12 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు.

జనసేనలో చేరిన యువకులు

నక్కపల్లి, ఏప్రిల్ 18: మండలంలోని చినదొడ్డిగల్లులో పలువురు యువకులు గురువారం జనసేన పార్టీలో చేరారు. వారందరికీ జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు అన్ని వర్గాల వారికి ఎంతో నచ్చాయన్నారు. .ఎన్‌డీఏ కూటమి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వెలగా సుధాకర్, తుమ్మల శ్యామ్, కిశోర్, వీరబాబు, తూము రాజాబాబు, దుర్గ, వాసు తదితరులు పాల్గొన్నారు.

నేడే విడుదల



వైజాగ్ : శ్రీమెలోడి

వైజాగ్ : శరత్	వైజాగ్ : ముక్త
వైజాగ్ : వరుణ్ INOX	వైజాగ్ : CMR INOX
వైజాగ్ : చిత్రాలయ INOX	గాజువాక : లక్ష్మీకాంత్
వైజాగ్ : CMR INOX	అనకాపల్లి : శ్రీసత్య
మధురవాడ : శ్రీకన్యసినీపోలిస్	విజయనగరం : హిమగిరి
విజయనగరం : NCS INOX	శ్రీకాకుళం : కిన్నెర

చక్కెర కర్మాగారాలకు చేదు కాలం

... 5వ పేజీ తరువాయి

చేశారు. తాము అధికారంలోకి వస్తే షుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం జగన్మోహన్‌రెడ్డి తుంగలో తొక్కారు. 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరించకపోగా పూర్తిగా మూసివేయించారు. దివాలా పరిశ్రమగా ముద్ర వేశారు. ఫ్యాక్టరీకి చెందిన కోట్లాది రూపాయల విలువ చేసే స్థిరాస్తులను లిక్విడేషన్ పేరుతో కారు చౌకగా అసమ్మదీయులకు కట్టబెట్టడానికి ప్రయత్నించారని కార్మికులు, రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు, టీడీపీ, సీపీఎం, జనసేన, రైతు సంఘాల నాయకులు ఆందోళన బాట పట్టారు. లిక్విడేషన్ ఆదేశాలపై కొంతమంది రైతులు కోర్టును ఆశ్రయించారు. యథాస్థితిని (స్టేటస్ కో) కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేయడంతో ఆస్తుల విక్రయంపై ప్రభుత్వం వెనక్కి తగ్గింది

వైసీపీ నుంచి భారీ వలసలు

... 5వ పేజీ తరువాయి

కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాగా ఉప్పవరం మాజీ సర్పంచ్ అడపా మహలక్ష్మి నాయుడు తన అనుచరులతో కలిసి జనసేన ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల ముఖ్యప్రతినిధి సుందరపు సతీశ్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. పూడిమడకలో పలువురు వైసీపీ నాయకులు జనసేన పార్టీలో చేరారు. కార్యక్రమాల్లో జనపరెడ్డి శ్రీనివాసరావు, డీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

మరింత పెరిగిన భానుడి ప్రతాపం

... 5వ పేజీ తరువాయి

రోలుగుంటలో 42.4, కె.కోటపాడులో 42.3, కశింకోట, మాకవరపాలెంలో 42.2, మాడుగులలో 42.1, చోడవరంలో 42, గొలుగొండలో 41.9, బుచ్చెయ్యపేటలో 41.7, నాతవరంలో 41.4, సబ్బవరంలో 40.6, అనకాపల్లిలో 40.3, పాయకరావుపేట, ఎస్.రాయవరంలో 38.1, మునగపాక, ఎలమంచిలిలో 37.9, పరవాడలో 37.8, నక్కపల్లిలో 37.7, అచ్యుతాపురంలో 37.4, రాంబిల్లిలో 34.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

తొలిరోజు నామినేషన్లు నిల్

నక్కపల్లి, ఏప్రిల్ 18: పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి తొలిరోజు గురువారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను తహసీల్దార్ కార్యాలయం నోటీసు బోర్డులో ఆర్వో గీతాంజలి ప్రదర్శించారు. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ మధ్యాహ్నం 3 గంటల వరకూ ఇతరులెవ్వరిని లోపలకి అనుమతించబోమని ఆర్వో గీతాంజలి చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎలక్షన్ డీటీ చైనులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో స్థిరంగా ఉష్ణోగ్రత

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 18: పట్టణంలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. గురువారం అత్యధిక ఉష్ణోగ్రత 40.3, అత్యల్ప ఉష్ణోగ్రత 27.0గా నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. మధ్యాహ్నం వరకు ఉష్ణోగ్రతతో ప్రజలు ఇబ్బందులు పడినప్పటికీ మూడు గంటల సమయంలోనే వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు.

ఎట్టకేలకు రంగులు మారాయి

» వైసీపీ జెండా రంగులతో ఉన్న కట్టడాలపై అధికారులు ప్రత్యేక దృష్టి


మహిళా మార్టు వద్ద జెండా దిమ్మకు తెల్లరంగు వేస్తున్న దృశ్యం


ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో శిలాఫలకానికి తెలుపు రంగు వేసి కాగితం అంటింపు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 18 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అధికార పార్టీ వైసీపీ జెండా రంగులు కలిగి ఉన్న వాటిపై అధికారులు దృష్టి సారించకపోవడంతో 'ఆంధ్రజ్యోతి' కథనం వారిలో కదలిక తెప్పించింది. ఎట్టకేలకు ఆయా రంగులను మార్చే పనిలో పడ్డారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చి నెల రోజులు కావస్తున్నా వైసీపీ రంగులు తొలగించకపోవడంతో గురువారం 'కోడ్ కూసి నెల .. రంగులు మారకుంటే ఎలా?..' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీంతో వెంటనే అధికారులు స్పందించి మాడుగులలోని మహిళా మార్టు గేటుకి, ఆ పక్కనే ఉన్న జెండా దిమ్మకు వైసీపీ రంగులను తొలగించారు. అలాగే ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో రోడ్డు నిర్మాణం నిమిత్తం ఆవిష్కరించిన శిలాఫలకానికి ఉన్న వైసీపీ రంగులను సైతం తొలగించి, సదరు శిలాఫలకంపై పేర్లు కనిపించకుండా కాగితాలు అతికించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జీడిమామిడి రైతుకు ఎన్నికల కోడ్ దెబ్బ

... 5వ పేజీ తరువాయి

రైతులు వాపోతున్నారు.ఈ నెల మొదటి వారం నుంచి జీడి పిక్క లను సేక రించి ఎండ బెడుతున్నారు. తొలివిడత సేకరించిన జీడి పిక్క లను విక్రయించాలని భావిస్తుండగా, ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు రావడంలేదు. ఎన్నికల కోడ్ కారణంగా అధిక మొత్తంలో నగదు తీసుకెళ్లే పరిస్థితి లేకపోవడమే ఇందుకు కారణమని అంటున్నారు. దీంతో స్థానిక వ్యాపారులు (దళారులు) జీడిపిక్కల ధర లను అమాంతం తగ్గించేశారు. క్వింటా రూ.9 వేలకు మించి కొనుగోలు చేయడ లేదు.


తోటల్లో సేకరించిన జీడిమామిడి పిక్కలు, పండు

గత ఏడాది క్వింటా జీడి పిక్కలు రూ.11-12 వేల వరకు కొనుగోలు చేశారని, ఈ ఏడాది దిగుబడి బాగా తగ్గినందున గిరాకీ ఏర్పడి క్వింటా రూ.12వేలకు పైబడి ధర పలుకుతుందని రైతులు ఆశించారు. కానీ ఎన్నికల కోడ్ తమ ఆశలను ఆవిరి చేసిందని జీడిమామిడి రైతులు వాపోతున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేయించి రైతులకు గిట్టుబాటు కల్పిస్తామని చెప్పిన సీఎం జగన్మోహన్‌రెడ్డి.. ఐదేళ్ల పదవీ కాలంలో ఒక్కఏడాది కూడా అమలు చేయలేదని రైతులు గుర్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

లంకెలపాలెం, ఏప్రిల్ 18: పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్యాభర్తలకు గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో భార్య అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. కుమారుడికి గాయాలు కాగా భర్త, కుమార్తె ప్రమాదం నుంచి బయట పడ్డారు. ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్స్‌లో పనిచేస్తున్న తలశిల అనీల్‌కుమార్, పెదముషిడివాడలో కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. భార్య శివేశ్వరి (34) కుమారుడు నిఖిల్ (8) కుమార్తె జశ్విక నలుగురు కలిసి ద్విచక్ర వాహనంపై అగనంపూడి పండగ కోసం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంపై వస్తుండగా లంకెలపాలెం పెట్రోల్ బంకు సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి గుర్తు తెలియని లారీ ఢీకొంది. భార్య శివేశ్వరి వెనక్కి పడడంతో లారీ చక్రాలు ఆమె తలపై నుంచి వెళ్లి సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. కుమారుడు నిఖిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భర్త అనిల్‌కుమార్, కుమార్తె జశ్విక ప్రమాదం నుంచి బయటపడ్డారు.

వైసీపీ నుంచి భారీ వలసలు

... 5వ పేజీ తరువాయి

కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాగా ఉప్పవరం మాజీ సర్పంచ్ అడపా మహలక్ష్మి నాయుడు తన అనుచరులతో కలిసి జనసేన ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల ముఖ్యప్రతినిధి సుందరపు సతీశ్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. పూడిమడకలో కూడా పలువురు వైసీపీ నాయకులు జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో జనపరెడ్డి శ్రీనివాసరావు, డీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చక్కెర కర్మాగారాలకు చేదు కాలం

... 5వ పేజీ తరువాయి

చేశారు. తాము అధిఇకారంలోకి వస్తే షుగర్ ఫ్యాక్టరీలను ఆధునీక రించేందుకు చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం జగన్మోహన్‌రెడ్డి తుంగలో తొక్కారు. 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరించకపోగా పూర్తిగా మూసివేయించారు. దివాలా పరిశ్రమగా ముద్ర వేశారు. ఫ్యాక్టరీకి చెందిన కోట్లాది రూపాయల విలువ చేసే స్థిరాస్తులను లిక్విడేషన్ పేరుతో కారు చౌకగా అస్మదీయులకు కట్టబెట్టడానికి ప్రయత్నించారని కార్మికులు, రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు, టీడీపీ, సీపీఎం, జనసేన, రైతు సంఘాల నాయకులు ఆందోళన బాట పట్టారు. లిక్విడేషన్ ఆదేశాలపై కొంతమంది రైతులు కోర్టును ఆశ్రయించారు. యథాస్థితిని (స్టేటస్ కో) కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేయడంతో ఆస్తుల విక్రయంపై ప్రభుత్వం వెనక్కి తగ్గింది

మరింత పెరిగిన భానుడి ప్రతాపం

... 5వ పేజీ తరువాయి

రోలుగుంటలో 42.4, కె.కోటపాడులో 42.3, కశింకోట, మాకవరపాలెంలో 42.2, మాడుగులలో 42.1, చోడవరంలో 42, గొలుగొండలో 41.9, బుచ్చెయ్యపేటలో 41.7, నాతవరంలో 41.4, సబ్బవరంలో 40.6, అనకాపల్లిలో 40.3, పాయకరావుపేట, ఎస్.రాయవరంలో 38.1, మునగపాక, ఎలమంచిలిలో 37.9, పరవాడలో 37.8, నక్కపల్లిలో 37.7, అచ్యుతాపురంలో 37.4, రాంబిల్లిలో 34.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మాడుగుల : పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతుండడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నాలుగైదు రోజులుగా మాడుగుల పరిసర మండలాల్లో ఎండ తీవ్రత మరీ అధికంగా ఉంది. దీనికితోడు వడగాల్పులు మరింత భయపెడుతున్నాయి. ఈ కారణంగా వృద్ధులు, పిల్లల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇక ఒంటిపూట బడుల కారణంగా ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు పాఠశాలలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలు విడిచిపెట్టిన తరువాత మండుటెండల్లో ఇంటికి వచ్చే విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

ఎన్నికల కోలాహలం ఆరంభం

» సబ్ కలెక్టర్ కార్యాలయంలో నోటిఫికేషన్ ప్రదర్శన » తొలిరోజు ఒక స్వతంత్ర, బీఎస్పీ అభ్యర్థి నామినేషన్లు » నిబంధనలు పక్కాగాఅమలు

నర్సీపట్నం, ఏప్రిల్ 18 : ఎన్నికల నోటిఫికేషన్ పత్రాలను గురువారం ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్డీవో జయరాం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు శాసన సభ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఔత్సాహికులు గురువారం నుంచి ఈనెల 25 వరకు ఉదయం పదకొండు గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటలులోపు నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చునన్నారు. 26వ తేదీన నామినేషన్ పత్రాలను పరిశీలిస్తామని తెలిపారు. 29వ తేదీ మూడు గంటలలోపు నామినేషన్ ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు.


ఎన్నికల నోటిఫికేషన్‌ను నోటీసు బోర్డులో ప్రదర్శిస్తున్న రిటర్నింగ్ అధికారి జయరాం

తొలిరోజు రెండు నామినేషన్లు

నర్సీపట్నం నియోజవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు తొలి రోజు రెండు నామిషనేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థిగా న్యాయవాది బయపురెడ్డి భద్రాచాలం తొలి నామినేషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా బొట్టా నాగరాజు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. సదరు అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు జతచేసిన డాక్యుమెంట్ల వివరాలతో చెక్ లిస్ట్ అందజేశారు. అభ్యర్థులతో రూ.పది వేలు చొప్పున డిపాజిట్ డబ్బులు కట్టించుకొని వారికి రశీదులు అందజేశారు. ఇదిలా వుంటే, ఎన్నికల వ్యయ పరిశీలకులు సంజయ్ గాంధీ సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆర్డీవో జయరాం ఆయనతో సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో మొక్క నాటించారు.

భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐ, నలుగురు ఎస్ఐలు, ముగ్గురు ఏఎస్ఐలు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 13 మంది కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వంద మీటర్ల పరిధిలో స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేశారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థితో సహా ఐదుగుర్ని మాత్రమే లోపలకు అనుమతించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు, ఇతరులకు సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోకి ప్రవేశం లేదు.


నర్సీపట్నం కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు


చోడవరం కార్యాలయ వద్ద ఏర్పాట్లు

చోడవరం, మాడుగులలో నామినేషన్లు నిల్

చోడవరం/మాడుగుల : ఎన్నికల నామినేషన్ల పర్వానికి రంగం సిద్ధమైనప్పటికీ, గురువారం తొలి రోజు చోడవరం, మాడుగుల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఎలాంటి నామినేషన్లు పడలేదు. ఉదయం నుంచి ఆయా రిటర్నింగ్ కార్యాలయాల వద్ద ఆర్వోలు చిన్నికృష్ణ, జీవీ సత్యవాణిలు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో ఎక్కువమంది రాకుండా, పరిమిత సంఖ్యలోనే వచ్చేలా కార్యాలయం గేటు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలిరోజు ఎలాంటి నామినేషన్లు పడలేదని ఆయా ఆర్వోలు తెలిపారు.

రెండు మండలాల్లో భారీ వర్షం

» ఉదయం నుంచి భానుడి ప్రతాపంతో అల్లాడి జనం
» సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి కుండపోత
» మాడుగుల, గొలుగొండల పరిధిలో సేదదీరిన జనం


మాడుగులలో కురుస్తున్న వర్షం


కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో వర్షం కురుస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట/ మాడుగుల, ఏప్రిల్ 18 : వాతావరణంలో మార్పుల కారణంగా జిల్లాలోని పలుచోట్ల గురువారం వర్షం కురిసింది. గొలుగొండ మండలం ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో ఉదయం నుంచి భానుడు భగభగమండాడు. ఇంట్లో ఉన్నా, వీధిలోకి వచ్చినా జనానికి చెమటలు ఆగలేదు. దీనికితోడు వడగాల్పులు మరింత భయపెట్టాయి. ఈ పరిస్థితుల్లో సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశంలో మబ్బులు కమ్ముకుని భారీ వర్షం కురిసింది. దీంతో అంతటా చల్లబడింది. మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో వర్షపునీరు ఎటూ పారే దారి లేక సీసీరోడ్డుపై నిలిచిపోయింది. దీనికి మురుగు తోడుకావడంతో అటుగా రాకపోకలకు గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వర్షం జీడిమామిడి తోటలకు ఎంతగానో మేలు చేస్తుందని ఆయా రైతులు చెపుతున్నారు.


వినాయక వీధిలో నిలిచిన నీరు

మాడుగుల మండలంలో...

మాడుగుల : ఏజెన్సీని ఆనుకుని ఉన్న మాడుగుల మండలంపై గురువారం వరుణుడు కరుణ చూపాడు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఈ ప్రాంతం నిప్పుల కొలిమిలా మారింది. ఇంటి నుంచి జనం బయటకు వచ్చేందుకు హడలిపోయారు. ప్రయాణాలు చేసేవారు తగిన జాగ్రత్తలు తీసుకుని ఎండ నుంచి ఉపశమనం పొందారు. అయితే సాయత్రం నాలుగు గంటల సమయంలో ఆకాశంలో మేఘాలు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది.

'ఇంటి నుంచి ఓట్లు వేసేవారి వివరాలు సేకరించండి'

మాకవరపాలెం, ఏప్రిల్ 18 : నడవలేని స్థితి ఉన్న దివ్యాంగులు, 85సంవత్సరాలు పైబడిన వృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓట్లు వేసే అవకాశాన్ని ఎలక్షన్ కమిషన్ కల్పించిందని, బీఎల్వో మండలంలో అటువంటి వారిని గుర్తించి పేర్లు అందజేయాలని తహసీల్దార్ మురళీమోహన్‌రావు సూచించారు. గురువారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఇంటి నుంచి ఓట్లు వేసేవారికి సంబంధించిన జాబితాను రెండురోజుల్లో సేకరించి సమర్పించాలన్నారు. అలాగే కొత్త ఓటర్లు ఉంటే వారిని గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో రూట్ అఫీసర్లు పాల్గొన్నారు.


బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనుల నాణ్యత పరిశీలన

గొలుగొండ, ఏప్రిల్ 18 : మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను క్వాలిటీ కంట్రోల్ విభాగం డీఈ కె.సత్యప్రభాకర్ గురువారం పరిశీలించారు. అడవిరాజులబాబు గుడి నుంచి పప్పుశెట్టిపాలెం మధ్యలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో నాలుగు కోట్ల రూపాలయ నిధులతో నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నారు. ఇందులో నాణ్యతను పరిశీలించేందుకు శాంపిల్స్‌ను సేకరించారు. నిర్మాణ పనుల్లో క్వాలిటీ ఆధారంగా కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని డీఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ విభాగం ఏఈలు శ్రీనివాసరెడ్డి, రాము, తదితరులు పాల్గొన్నారు.


పనుల్లో నాణ్యత పరిశీలనకు శాంపిల్స్ తీయిస్తున్న ఇంజనీర్లు

నేడు విద్యుత్‌కు అంతరాయం

చోడవరం, ఏప్రిల్ 18 : వేసవిలో పెరిగిన విద్యుత్ వినియోగం నేపథ్యంలో చీడికాడ సమీపంలోని 122 కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం పది నుంచి పన్నెండు గంటల వరకు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ చోడవరం ఏడీఈ గౌరీవరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని చోడవరం, బుచ్చెయ్యపేట, మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని వివరించారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

కొమరవోలు 11 కేవీ ఫీడర్ పరిధిలో...

రోలుగుంట : కొమరవోలు 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పది గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ వీడీవీ రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా కె.నాయుడుపాలెం, అంట్లపాలెం, కొవ్వూరు, భోగాపురం, కంచుగుమ్మల, నందిపురం, కొంతలం, శరభవరం, కె.అడ్డసరం, కె.కొత్తూరు గ్రామాల్లో ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్టు వివరించారు.

కృష్ణాదేవిపేట సబ్ స్టేషన్ పరిధిలో...

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, వైర్లపై పడే చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ నర్సీపట్నం డీఈఈ వీడీవీ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కృష్ణాదేవిపేట, సీహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, శరభన్నపాలెం ఫీడర్ పరిధిలోని ఇరవై గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

21న మంచాల స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

చీడికాడ, ఏప్రిల్ 18 : మండలంలోని మంచాల మోడల్ స్కూల్‌లో ఈ విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరేందుకు ఈనెల 21వ తేదీన ప్రవేశ పరీక్ష జరగనుందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ చెరకాపు వెంకటలక్ష్మి తెలిపారు. ఈ ఏడాది ఐదో తరగతి చదువుతూ ఆరో తరగతిలో చేరేందుకు ఇప్పటికే దరఖాస్తు చేసిన విద్యార్థులు ఆదివారం ఉదయం పది నుంచి పన్నెండు గంటల వరకూ జరిగే ప్రవేశ పరీక్ష రాసేందుకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఉదయం తొమ్మిదిన్నర గంటలకే హాల్ టికెట్లు పట్టుకొని పరీక్షకు రావాలని ఆమె కోరారు.

మాధవనగరంలో తాగునీటి సమస్య

నాతవరం, ఏప్రిల్ 18 : మాధవనగరం గ్రామంలో రోజూ కుళాయిల ద్వారా నీరు సరఫరా కాకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు గ్రామస్తులు చెపుతున్నారు. పంచాయతీ పాలకులు రోజూ ట్యాంక్‌ను నింపి, కుళాయిలకు విడుదల చేసేందుకు ఓ వ్యక్తిని ఏర్పాటు చేశారని, సదరు వ్యక్తి ఒక రోజు కుళాయిల ద్వారా నీరు విడుదల చేస్తే మరో రోజు ఇవ్వకపోవడం వల్ల ఈ సమస్య ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. అసలే వేసవి కాలమని, ఈ పరిస్థితుల్లో బిందెలతో బోర్ల వద్ద నుంచి నీటిని తెచ్చుకోవడం కష్టంగా ఉందని మహిళలు చెపుతున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

'వేసవిలో ఆరోగ్య సూత్రాలు పాటించాలి'

కె.కోటపాడు, ఏప్రిల్ 18 : ఎండలు మండుతున్న నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కె.కోటపాడు వైద్య విధానపరిషత్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా పిల్లలు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎండల్లోకి పిల్లలు వెళ్లకుండా చూడాలని వివరించారు. వివిధ పనులపై బయటకు వెళ్లేవారు ఎండ నుంచి తగిన రక్షణ పొందేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సీజన్‌లో కొబ్బరిబొండాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితరాలు ఎక్కువగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదన్నారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రలకు వెళ్లి చికిత్సలు పొందాల్సిందిగా ఆమె సూచించారు.

సుందరకోటలో నాలుగు పూరిళ్లు దగ్ధం

నాతవరం, ఏప్రిల్ 18 : మండలంలోని సుందరకోటలో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన కూడా లక్ష్మణరావు, బ్రహ్మరాజు, రాజులమ్మ, జంపా పెంటమ్మలకు చెందిన ఇళ్లు పూర్తిగా కాలిపోవడంతో పాటు సామగ్రి, నగదు బూడిదై కట్టుబట్టలతో మిగిలారు. అసలే వేసవి కాలమని ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని విలపిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాల్సిందిగా ఆయా బాధితులు కోరుతున్నారు.

పదకొండు ఎకరాల్లో జీడితోటలు దగ్ధం


అగ్నిప్రమాదంలో దగ్ధమైన జీడితోట


రావికమతం, ఏప్రిల్ 18 : కొత్తకోటలో ఐదుగురు రైతులకు చెందిన పదకొండు ఎకరాల్లోని జీడి తోటలు గురువారం మధ్యాహ్నం దగ్ధమయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తి కాల్చిన సిగిరెట్టు పడేయడంతో ఈ ఘటన జరిగిందని బాధిత రైతులు భీమరాతి మణి, శాంతి, రమణమ్మ, తంటపు రెడ్డి జయ, వెచ్చా కొండమ్మలు వాపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు అరు లక్షల రూపాయల వరకు నష్టం జరిగినట్టు తెలిపారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రి

రావికమతం, ఏప్రిల్ 18 : నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపారు. దిడ్డి గ్రామ శివారు తోటల్లో జోరుగా నాటు సారా తయారు చేసి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్టు ముందుగా సమాచారం అందిందన్నారు. ఈ మేరకు గురువారం ఉదయం సదరు ప్రాంతంలో సిబ్బందితో దాడి చేసి వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు సారా తయారీకి అవసరమైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.


అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

చీడికాడ, ఏప్రిల్ 18 : దండిసురవరంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బత్తిన గంగరాజు కుటుంబానికి స్నేహాంజలి ఫర్ పూర్ స్వచ్ఛంద సంస్థ బాసటగా నిలిచింది. ఈ సందర్భంగా సదరు సంస్థ ప్రతినిధులు పట్నాల గోపి, ఎం.వీర్రాజు, రాజేంద్రప్రసాద్, చంద్రశేఖర్‌లు గురువారం సాయంత్రం రూ.పది వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెంకి శివ, తలుపులయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

దేవరాపల్లి, ఏప్రిల్ 18 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న ఆరోపించారు. గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కూలీలకు వంద రోజుల పనిదినాలను రెండు వందల రోజులకు చేయాలని, రోజు కూలి ఆరు వందల రూపాయలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, వేసవి కారణంగా ఎండలు ముదురుతున్నందున పని ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని, టెంట్లు, తాగునీరు, మజ్జిగ వంటివి అందుబాటులో ఉంచాలని కోరారు.



జానకిరామపురం అగ్రహారం ఇనాం గ్రామమే..

» పాసు పుస్తకాల జారీ సక్రమమే » హైకోర్టు వ్యాఖ్య

రోలుగుంట, ఏప్రిల్ 18 : మండలంలోని జానకిరామపురం (జేపీ) అగ్రహారం ఇనాం భూ సమస్యకు సంబంధించి హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సర్వే సెటిల్‌మెంట్ 35/50 ప్రకారం 'జేపీ అగ్రహారం భూ సమస్యను పరిష్కరించాలని, జేపీ అగ్రహారం ఇనాం గ్రామం కాదని, ఇనాందారులకు ఈ భూములపై హక్కు లేదని, పూర్వ తహసీల్దార్ అడ్డగోలుగా ఇనాందారులకు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారని, వాటిని రద్దుచేయాలి' అని కోరుతూ 2022వ సంవత్సరంలో జేపీ అగ్రహారం రైతుల తరపున దుంగల యర్రాపాత్రుడు, దుంగల శ్రీనులు హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశారు. సదరు పిటిషన్‌ను కొట్టివేస్తూ ఈ నెల 16వ తేదీన హైకోర్టు తీర్పు వెల్లడించింది.

ఏళ్ల క్రితం విజయనగరం రాజుల ఆధీనంలో ఉండే సర్వే నంబరు 1 నుంచి 93 సర్వే నంబర్లలో సాగుభూమి, చెరువులు, రోడ్డు, పోరంబోకు, గోర్జు వంటివి కలిపి సుమారు 408 ఎకరాల భూమిని సాగుచేయడం ద్వారా వచ్చే ఆదాయంతో నక్కపల్లి మండలం ఉపమాకలోని వేంకటేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి చేయడంతో పాటు ధూప, దీప నైవేద్యాలు సమర్పించడం కోసం కొంత మంది వైష్ణవులకు అప్పగించారు. వైష్ణవుల వద్ద నున్నా వారి కుటుంబీకులు కొనుగోలు చేసినట్టు రికార్డులు చెబుతున్నాయి. వాస్తవానికి అప్పటికే జేపీ అగ్రహారం గ్రామం ఏర్పడింది. ఈ భూములను సాగుచేసే రైతులు శిస్తు రూపేణా నున్నా వారికి ఏటా కొంత మొత్తం చెల్లించి మధ్యలో ఆపేశారు. దీంతో నున్నావారు అప్పటి నర్సీపట్నం ఆర్డీవో కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో అప్పటి ఉన్న భూమిలో రెండు వాటాలు రైతులకు, నున్నా కుటుంబాలకు ఒక వాటా (సుమారు 137 ఎకరాలు) చొప్పున చెందేలా తీర్పు ఇచ్చారు. ఈ మేరకు 2017లో నున్నా వారి కుటుంబాల నుంచి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వీవీవీ నాగవర్మ, మరో ఎనిమిది మంది కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి వీవీ వర్మరాజు మరికొంత మందరి పేరు మీద పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారు. 2021వ సంవత్సరంలో కూడా పూర్వ తహసీల్దార్ కృష్ణమూర్తి కూడా పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారు. రైతులు వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ వేశారు. రెండేళ్ల విచారణ అనంతరం ఈ నెల 16న జేపీ అగ్రహారం గ్రామం ఇనాం గ్రామమని, కోర్టు ఆర్డర్ ప్రకారం 1978లోనే సెటిల్ అయ్యిందని, పాసుపుస్తకాలు జారీ సక్రమమేనని తీర్పు వెల్లడిస్తూ పిటిషన్‌ను కొట్టివేశారు.


జేపీ అగ్రహారం గ్రామ భూములు